RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక
The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 | సంచిక: 20 | ఎడిటర్ : జేరిపోతుల సంపత్, కరీంనగర్ | గురువారం 23-4-2026 | పేజీలు: 8 | వెల: రూ. 2.00

తెలంగాణ వాణి TELANGANA VANI TELUGU DAILY
తెలుగు దినపత్రిక The Voice of Telangana
R N I No. APTEL/2012/53127

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292

## కేసీఆర్, హరీష్ రావులకు
# హైకోర్టులో ఊరట



- ఘోష్ కమిషన్ రిపోర్టుపై కీలక తీర్పు
- కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశం
- నిబంధనలను ఘోష్ కమిషన్ పాటించలేదని కోర్టు స్పష్టీకరణ
- కేసీఆర్, హరీశ్‌తో పాటు ఇద్దరు ఐఏఎస్‌లు దాఖలు చేసిన పిటిషన్లపై కోర్టు తీర్పు
- కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వానికి ఉన్నా నివేదిక ఆధారంగా చర్యలు చెల్లవని వ్యాఖ్య

**హైదరాబాద్** తెలంగాణ హైకోర్టులో మాజీ సీఎం కేసీఆర్, హరీష్ రావులకు భారీ ఊరట కలిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణకు ఏర్పాటు చేసిన జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ చేపట్టిన పీసీ ఘోష్ కమిషన్ ఎలాంటి నిబంధనలు పాటించలేదని హైకోర్టు తెలిపింది. కనుక ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు చేపట్టవద్దని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, అవకతవకలపై విచారణ కమిషన్‌ను నియమిస్తూ 2024 మార్చి 14న జారీ చేసిన జీవో నంబర్ 6ను హైకోర్టులో సవాల్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు ఐఏఎస్ అధికారులు స్మితా సభర్వాల్, ఎస్.కె.జోషిలు విడివిడిగా పిటిషన్లు దాఖలు చేయడం తెలిసిందే. ఈ పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఇప్పటికే విచారణ జరిపి మార్చి 12న తీర్పును రిజర్వు చేసింది. ఈ నెల 8వ తేదీనే వెల్లడించాల్సి ఉన్నప్పటికీ, తీర్పు కాపీ రెడీగా లేకపోవడం, ఇతర సాంకేతిక కారణాలతో ఏప్రిల్ 22కు తీర్పు వాయిదా వేశారు. పీసీ ఘోష్ కమిషన్ విచారణ ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని, తమపై అభియోగాలు మోపే ముందు కనీసం తమ వాదనలను పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్లు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజాప్రయోజనాల పేరుతో ఇతరుల వ్యక్తిగత పరువు ప్రతిష్ఠలు దెబ్బతీయడం

2లో..

## ప్రధాని మోదీపై ‘ఉగ్రవాది’ వ్యాఖ్య

**- ఖర్గేకు ఈసీ నోటీసులు**



న్యూఢిల్లీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ‘ఉగ్రవాది’ అని వ్యాఖ్యానించారన్న ఆరోపణలపై భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తీవ్రంగా స్పందించింది. ఈ వ్యాఖ్యలపై 24 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఖర్గేకు నోటీసులు జారీ చేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా, రాజకీయ గౌరవాన్ని దెబ్బతీసేలా ఈ వ్యాఖ్యలు

2లో..

## భారత్‌ను తాకితే ‘డాట్ డాట్ డాట్’

**- పాక్‌కు రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్**



**న్యూఢిల్లీ** పహల్గాం ఉగ్రదాడి జరిగి ఏడాది. పహల్గాం సమీపంలోని బైసరణ్ వ్యాలీలో పర్యాటకులపై జరిగిన ఘోర ఉగ్రదాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జర్మనీ పర్యటనలో ఉన్నప్పటికీ, అక్కడి నుంచే పాకిస్థాన్‌కు అత్యంత శక్తిమంతమైన హెచ్చరికలు జారీ చేశారు. “భారత్ తనంతటి తానుగా ఎవరిపైనా దాడి చేయదు. కానీ మా పొరుగున ఒకే ఒక దేశం ఎప్పుడూ సమస్యలు

2లో..

## హర్మూజ్‌పై పట్టు మాదేనన్న ట్రంప్

**- దిగ్బంధనాన్ని ఛేదించి 34 ఇరాన్ ట్యాంకర్ల ప్రయాణం**



**టెహ్రాన్** హర్మూజ్ జలసంధి తమ పూర్తి నియంత్రణలో ఉందని, ఇరాన్‌తో తుది ఒప్పందం కుదిరే వరకు సముద్ర దిగ్బంధం ఎత్తివేసేది లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. ఈ దిగ్బంధం అద్భుత విజయం సాధించిందని ఆయన పేర్కొన్నారు. అయితే, వాస్తవ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని, అమెరికా ఆంక్షలను దాటుకుని ఇరాన్‌కు చెందిన డజన్ల కొద్దీ నౌకలు తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాయని అంతర్జాతీయ నివేదికలు చెబుతున్నాయి. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం

2లో..

## చేపల కూరే ఎజెండా

**- బెంగాల్ ఎన్నికల ప్రచారంలో ఇదే హైలెట్**



**కోల్కతా** పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రచారం ప్రస్తుతం విభిన్న మలుపులు తిరుగుతోంది. అభివృద్ధి, అవినీతి వంటి అంశాల కంటే ఇప్పుడు అక్కడ చేపల కూర చుట్టూ రాజకీయం తిరగడం ఆసక్తికరంగా మారింది. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ, బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి విసిరిన చేపలు తినే సవాల్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. బెంగాల్ సంస్కృతిలో చేపలు ఒక విడదీయలేని భాగం. బెంగాలీలు కుల,మతాలకు అతీతంగా చేపలను తింటారు. అది వారికి వెజ్ లెక్క అనుకోవచ్చు.అయితే బీజేపీ అధికారంలోకి వస్తే ఆహారపు అలవాట్లపై దాడి చేస్తుందని చేపల్ని తిననీయరని ఇతర పార్టీలు ముఖ్యంగా టీఎంసీ ప్రచారం చేస్తోంది. దీంతో బెంగాల్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న అస్సాం సీఎం హిమంత బిస్వా శర్మ మమతా బెనర్జీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ క్రమంలోనే ఆయన ఒక అడుగు ముందుకు వేసి, చేపల కూర తినడంలో మమతా దీదీకి, నాకు మధ్య పోటీ పెడితే నేనే గెలుస్తాను అంటూ సవాల్ విసిరారు. అస్సాం ప్రజలు కూడా బెంగాలీల కంటే ఎక్కువగా చేపలను ఇష్టపడతారు. నాకు వండటం, వడ్డించడం, తినడం మూడూ తెలుసు కానీ దీదీకి తెలియదని బిశ్వశర్మ విమర్శించారు. వెజిటేరియన్ వర్సెస్ నాన్-వెజిటేరియన్ అనే చర్చ బెంగాల్‌ను కుదిపేస్తోంది. బీజేపీని ఉత్తరాది పార్టీగా, శాఖాహార భావజాలాన్ని రుద్దే పార్టీగా టీఎంసీ చిత్రించే ప్రయత్నం చేయగా దానికి చెక్ పెట్టేందుకే హిమంత బిస్వా శర్మ ఈ చేపల సవాల్ ను తెరపైకి తెచ్చినట్లు కనిపిస్తోంది. తాము కూడా చేపలనుని ఇష్టపడతామని, బెంగాల్ ప్రజల అలవాట్లకు తాము దూరం కాదని చెప్పడం ద్వారా స్థానిక ఓటర్లను ఆకట్టుకోవాలన్నది బీజేపీ ప్లాన్. ఇప్పటికే స్థానిక బీజేపీ నేతలు ఇదే విషయాన్ని చెబుతూ తమతో పాటు చేపల్ని కూడా తీసుకెళ్తున్నారు. సోషల్ మీడియాలో నెటిజన్లు కూడా చేపల యుద్ధం పేరుతో మీమ్స్ షేర్ చేస్తున్నారు. సీరియస్ రాజకీయ అంశాల కంటే ఇలాంటి వినోదభరితమైన , సెంటిమెంట్ పరమైన అంశాలే ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తాయని కొందరు అంచనా వేస్తున్నారు. మొత్తానికి బెంగాల్ ఎన్నికల బరిలో చేపల కూర ఒక శక్తివంతమైన రాజకీయ ఆయుధంగా మారింది. బెంగాలీలు ఈ వివాదాన్ని ఏ కోణంలో చూసి ఓట్లు వేస్తారో చూడాల్సి ఉంది.

## జస్టిస్ ఘోష్ రిపోర్టుపై
# ప్రభుత్వం తర్జన భర్జన

**- సుప్రీంకోర్టుకు వెళ్లడమా.? మళ్లీ కమిషన్ పని ప్రారంభించడమా?**



**హైదరాబాద్** కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై వెలువడిన హైకోర్టు తీర్పు తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనాన్ని సృష్టించింది. చట్టబద్ధతకూ, సహజ న్యాయసూత్రాలకూ మధ్య జరిగిన ఈ న్యాయపోరాటం ఇటు ప్రభుత్వానికి, అటు బీఆర్ఎస్ అగ్రనేతలకు చెరో సగం విజయాన్ని, చెరో సగం ఆందోళనను మిగిల్చింది. ఇప్పుడు ప్రభుత్వం ఏం చేయబోతోందన్నది ఆసక్తికరమైన అంశంగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులపై ప్రభుత్వం తక్షణమే ఎటువంటి కఠిన చర్యలు తీసుకోకుండా హైకోర్టు బ్రేక్ వేసింది. విచారణా చట్టం సెక్షన్

## పీసీ ఘోష్ కమిషన్ కాదు
# పీసీసీ నివేదిక

**- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్** కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌పై దుష్ప్రచారం చేసిన వారి చెంప చెళ్లుమనిపించేలా హైకోర్టు తీర్పు వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పీసీ ఘోష్ ఇచ్చిన నివేదికపై బుధవారం హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, ఈ తీర్పు ద్వారా కూలింది కాళేశ్వరం కాదని, కాంగ్రెస్ చేసిన కుట్రలు అని వ్యాఖ్యానించారు. హైకోర్టు తీర్పుతో ఈరోజు గెలిచింది తెలంగాణ ప్రజలు, రైతులు, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కృషి చేసిన ఇంజినీర్లు అన్నారు. మూడేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై దుష్ప్రచారం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈరోజు తెలంగాణలో పారుతున్న ప్రతి నీటిబొట్టు కేసీఆర్ చేసిన కృషివల్లే వచ్చిందని అన్నారు. తెలంగాణ భూమిపై గోదావరి పారినన్ని రోజులు

2లో..

## మరో సకల జనుల సమ్మె!

**- ప్రభుత్వానికి ఆర్టీసీ జేఏసీ హెచ్చరికలు**



**హైదరాబాద్** తెలంగాణలో బస్సులు బంద్ అయ్యాయి. డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెతో బుధవారం ఉదయం బస్ డిపోల నుంచి బస్సులు బయటికి రాలేదు. మరోవైపు తాత్కాలిక డ్రైవర్, కండక్టర్లను విధుల్లోకి తీసుకుని బస్సులను నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆర్టీసీ సమ్మె చేస్తున్న జేఏసీ నేతలు హైదరాబాద్ గన్ పార్క్ వద్ద నివాళులు అర్పించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు.ప్రభుత్వం స్పందించకపోతే మరో సకల జనుల సమ్మెకు రెడీ అవుతామని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న తీవ్ర హెచ్చరికలు చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ మినహా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలతోపాటు ఉద్యోగ, ప్రజా సంఘాలు కూడా ఈ ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపినట్లు చెప్పారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి తమను చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. తాము లేవనెత్తిన సమస్యలు, చేస్తున్న డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఇప్పుడు చేస్తున్న సమ్మెను మరింత తీవ్ర స్థాయికి తీసుకెళ్తామని హెచ్చరించారు. తాము సమ్మె

2లో..

## తెలంగాణలో ఆరుగురు ఐపీఎస్‌లకు డీజీ హోదా

**- పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**



**హైదరాబాద్** రాష్ట్రంలోని ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ తెలంగాణ సర్కార్ నిర్ణయం వెలువరించింది. ఈ నేపథ్యంలోనే దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలోని ఆరుగురు సీనియర్ ఐపీఎస్‌లకు డీజీ హోదా కల్పించింది. ఆరుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు డైరెక్టర్ జనరల్ (డీజీ)గా ప్రమోషన్ కల్పిస్తూ ఉత్తర్వులు వెలువరించింది. ఇక డీజీలుగా పదోన్నతి

2లో..

# ఈనెల 28న చలో విద్యుత్ సౌధ

**- రు. 50వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలి**

**- కొత్తగూడెం లో పోస్టర్ ఆవిష్కరణ**

**- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు "మంద"**



కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి) సింగరేణి సంస్థ కు తెలంగాణ ట్రాన్స్కో జన్కో నుండి రావలసిన రు.50 వేల కోట్లకు పైగా బకాయిలను వెంటనే రాబట్టేందుకు ఈనెల 28న విద్యుత్ సౌధ, హైదరాబాద్ ముందు జరిగే నిరసన కార్యక్రమానికి సింగరేణి కార్మికులు కదలి రావాలని సిఐటియు అనుబంధ సింగరేణి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు పిలుపునిచ్చారు. బుధవారం సింగరేణి సెంట్రల్ వర్క్ షాప్ కార్పొరేట్ కొత్తగూడెం నందు జరిగిన పోస్టర్ ఆవిష్కరించి కరపత్రాలు, కరపత్రాలు పంపిణీ చేసి అనంతరం పిట్ మీటింగ్లో మాట్లాడారు.సింగరేణి కి రావాల్సిన బకాయిలు చెల్లించకపోవడం వల్ల కార్మికుల జీతభత్యాలు, మెయింటెనెన్స్ కొరకు బ్యాంకుల చుట్టూ తిరిగి వడ్డీలకు అప్పులు తీసుకురావాలని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణిలో ఉన్న ఫిక్స్ బాండ్లు కూడా ఖాళీ అయిపోయాయని ఇంతటి సంక్షోభం గతంలో ఎన్నడూ సింగరేణి సంస్థ ఎదుర్కోలేదని ఆయన పేర్కొన్నారు. ఇతర దేశాల నుంచి 200 మిలియన్ టన్నుల బొగ్గును దిగుమతి చేసుకొని ఇబ్బంది పడే కంటే సింగరేణి బొగ్గును కరెంటును డిమాండ్ ఉన్నచోట అమ్ముకోవడం ద్వారా సింగరేణి సంస్థను కాపాడుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. సింగరేణి ద్వారా బొగ్గు బకాయిలు మరియు కరెంటు బకాయిలు ఇవ్వకపోతే ఇప్పటినుంచైనా బొగ్గు కరెంటును డిమాండ్ ఉన్నచోట అమ్మడం ద్వారా సంస్థను అధిక ఇబ్బందుల నుండి గట్టెక్కించడానికి మరియు సింగరేణి భవిష్యత్తుకు తోడ్పడతాయని ఆయన పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం ట్రాన్స్కో జెన్కో వారికి పాత బకాయిలు ఇచ్చేంతవరకు బొగ్గును కరెంటును ఇవ్వకుండా నిలుపుదల చేయాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ జైపూర్ లో తయారు చేస్తున్న కరెంటుకి రూ.4.95 పైసలు ఖర్చు కాగా దానిని రాష్ట్ర ప్రభుత్వానికి అమ్మేది కేవలం రూ.5.42 పైసలకు మాత్రమే అమ్మటం వల్ల 0.47 పైసలు యూనిటీకి లాభం వస్తున్నదని, ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థకు రావలసిన కరెంటును రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 8.65 పైసలు కొనాల్సి వస్తుందని తద్వారా నెలకు 42 కోట్ల చొప్పున సాలీనా 504 కోట్ల రూపాయలు చెల్లిస్తున్నదని కనీసం కరెంటు వాడుకుంటున్న సింగరేణి చెల్లించాల్సిన బకాయిలన్నా నిలుపుదల చేయకుండా చెల్లించాల్సిన పరిస్థితి అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఉన్న టిఆర్ఎస్ కావచ్చు, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ కావచ్చు సింగరేణి సంస్థను ఆర్థిక ఇబ్బందులకు నెట్టటంతో పాటు సింగరేణికి వచ్చే నైని బ్లాకు తో సహా ఇల్లందు ఓసి, కొత్తగూడెం ఓసి, బెల్లంపల్లి,గోదావరిఖని, భూపాలపల్లి లో బొగ్గు తీసే పనులు కూడా ప్రైవేటు వారికి ఇచ్చి సింగరేణి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నదని తెలియజేశారు. టెండర్లలో కూడా ఎక్కువ ధరకు వేసి సింగరేణిని లూటి చేస్తున్నదని, వడ్డీకి తీసుకొచ్చిన డబ్బులను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఫుట్బాల్ పేరుతో 10 కోట్లు, జాబు మేళ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కొక్క ఏరియాలో ఇతర ఏరియాలలో ఒక సభకు 40 లక్షల చొప్పున సింగరేణి డబ్బులు లూటీ చేస్తున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు ఇచ్చింది శూన్యమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో ఉన్న అతి పెద్ద పరిశ్రమ సింగరేణి ని లాభాలు రికార్డు స్థాయిలో సాధిస్తూ జాతీయ అంతర్జాతీయ అవార్డులు చేస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి ఈ విధంగా లూటీ చేయటం సరైనది కాదని ఆయన పేర్కొన్నారు. సింగరేణి గత ఎన్నికల సందర్భంగా సింగరేణి అభివృద్ధి చేస్తామని సింగరేణి కార్మికులకు సొంత ఇంటి పథకం ఇన్కమ్ టాక్స్ మారుపేరుల సమస్య లాంటి ముఖ్యమైన సమస్యలను పరిష్కరిస్తామని ఐఎన్టీయూసీ ఆరు ఏరియాలలో ఏఐటిసి 5 ఏరియాలలో గెలిచి వాటి ఊసే మరిచారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకపోగా గతంలో ఉన్న కారుణ్య నియామకాల హక్కును కూడా ఈ రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తుంటే గెలిచిన ప్రాతినిధ్య సంఘాలు కండ్లప్పకి ఇచ్చి చూస్తున్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇదే విధానాలు ఇలాగే కొనసాగితే గత ప్రభుత్వం కెసిఆర్ కు ఫామోజుకు పరిమితం చేసిన సింగరేణి కార్మికులే ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టిస్తారని ఆయన హెచ్చరిక చేశారు. గెలిచిన ప్రాతినిధ్య సంఘాలు ఇప్పటికైనా కార్మికుల పక్షాన నిలబడకపోతే కంపెనీ రక్షణ కొరకు పోరాడకపోతే కార్మికులు వారికి తగిన గుణపాఠం చెప్తారని ఆయన అన్నారు.

ఇప్పటికైనా సింగరేణి రక్షణ కొరకు గెలిచిన ప్రాతినిధ్య సంఘాలతో పాటు అన్ని సంఘాలను కలుపుకొని సింగరేణి రక్షించాల్సిన బాధ్యత సింగరేణి కార్మిక సంఘాలకు మరియు సింగరేణి కార్మికులకు ఉన్నదని దానికోసం అందర్నీ ఐక్యం చేయాల్సిన బాధ్యత మన పైన ఉన్నదని దీన్ని విస్మరిస్తే వారిని కార్మికులు తగిన గుణపాఠం చెప్తారని ఆయన పేర్కొన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని కార్మికులు సంఘాల కతీతంగా విజయవంతం చేయాలని ఆయన కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు గాజుల రాజారావు రాష్ట్ర నాయకులు వై వెంకటేశ్వరరావు కొత్తపల్లి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ ఎర్త్ డే కార్యక్రమంలో ప్రభుత్వ విప్



**నకిరేకల్ :** నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని హై స్కూల్ నందు " వరల్డ్ ఎర్త్ డే " కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. హై స్కూల్ నుండి మెయిన్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని , పర్యావరణం పరిరక్షణ కోసం చెట్లు నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్తు తరానికి స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ఇప్పటినుంచి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రజిత – శ్రీనివాస్, విద్యార్థులు అధికారులు మరియు తదితరులు పర్యావరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**- ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు సదన్ మహరాజ్.**

**హుస్నాబాద్** రాష్ట్రం వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ధర్మసమాజ్ పార్టీ, బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్న సందర్భంలో హుస్నాబాద్ ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె దీక్షా శిబిరంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు సదన్ మహారాజ్ పాల్గొని పూర్తి మద్దతును ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం చొరవ తీసుకొని చర్చలు జరిపి పరిష్కరించాలని అన్నారు. ఆర్టీసీ కార్పొరేషన్ ని ప్రభుత్వంలో విలీనం చేయాలని, అందులో పని చేస్తున్న వారందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పెండింగ్లో ఉన్న ఏరియర్స్ విడుదల చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని చేస్తున్న డిమాండ్లు న్యాయ పరమైనవని అదేవిధంగా ధర్మ బద్ధమైనవని, అవేమీ గొంతెమ్మ కోరికలు కావని అన్నారు ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం ప్రజలకు నిరంతరం సేవ చేస్తున్నటువంటి ఆర్టీసీ కార్మికులకు ఉన్నటువంటి ఇబ్బందుల్ని ఎందుకు పరిష్కరించలేకపోతుందని ప్రశ్నించారు.. త్వరితగతిన ఆర్టీసీ ఉద్యోగులతో చర్చలు చేసి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, సమ్మెను విరమింపజేసి ప్రజా రవాణా పునరుద్ధరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని లేనిపక్షంలో ప్రభుత్వం యొక్క వైఫల్యాన్ని క్షేత్రస్థాయిలో ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు ఎల్లన్న, ఐలేష్, ప్రవీణ్, భిక్షు, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

### అంగన్వాడీ ప్రీస్కూల్ చిన్నారులకు

## ఏకరూప దుస్తుల పంపిణీ

**- పౌష్టికాహారం,పాఠ్యపుస్తకాలను అందజేసిన మంత్రి సీతక్క**

**ములుగు,** ములుగు జిల్లా మంగపేట గ్రామ పరిధిలోని శాంతినగర్ గుత్తి కోయగుంపులోని అంగన్వాడీ చిన్నారులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి,సరఫరా,మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి అదనపు జత ఏకరూప దుస్తులను,మూడేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం 'బాలామృతం', ప్రీ–ప్రైమరీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పిల్లలను పనిచేసే ప్రదేశాలకు తీసుకెళ్లవద్దని సూచించారు. గుత్తి కోయ ఆవాసంలోని పిల్లలు సక్రమంగా అంగన్వాడీ కేంద్రానికి హాజరవుతూ ఆటపాటలతో కూడిన ప్రీ–ప్రైమరీ విద్యను అభ్యసించాలని కోరారు అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం, ప్రీ–స్కూల్ విద్య ప్రభుత్వం అందిస్తుందని, ప్రతి చిన్నారి శారీరక, మానసిక వికాసానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు.

## వికారాబాద్‌లో స్థంభించిన ఆర్టీసీ రవాణా

**వికారాబాద్** వికారాబాద్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులు అర్థరాత్రి నుంచి సమ్మెకు దిగడంతో బస్సు సేవలు పూర్తిగా స్థంభించాయి. సమ్మె ప్రభావంతో వికారాబాద్ డిపో నుంచి ఒక్క ఆర్టీసీ బస్సు కూడా బయటకు రాకపోవడంతో అన్ని బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో ఉదయం నుంచే ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సు సేవలు లేకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు మరియు తమ పనులకు వెళ్లే ప్రజలు ప్రత్యామ్నాయ రవాణా కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఇక సమ్మె నేపథ్యంలో వికారాబాద్ జిల్లా ఆర్టీసీ డిపో ముందు భారీగా పోలీసులు మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టారు. ఆర్టీసీ జేఏసీ నాయకులతో ప్రభుత్వం నియమించిన కమిటీ జరిపిన చర్చలు విఫలమవడంతో కార్మికులు సమ్మె బాట పట్టినట్లు తెలిపారు. సమ్మె నోటీసులు ఇచ్చి 41 రోజుల తర్వాత మాత్రమే ప్రభుత్వం చర్చలకు పిలిచిందని, తమ సమస్యలను వివరించినప్పటికీ సరైన హామీ ఇవ్వలేదని కార్మికులు ఆరోపించారు. తమ డిమాండ్లు కొత్తవి కావని, పాతవేనని కార్మికులు స్పష్టం చేశారు.

ఆర్టీసీ విలీనం, సంఘాల ఎన్నికలు నిర్వహించడం, బస్సులను ఆర్టీసీ ద్వారానే నడపడం వంటి అంశాలు తమ ప్రధాన డిమాండ్లు అని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దంటే గతంలో 40 రోజులు అమ్మే చేశాం ఇపుడు మరింత పెద్దగా మా డిమాండ్లు నెరవేరే దాకా సమ్మె చేస్తామని ఆర్ టీ సి కార్మికులు డిమాండ్ చేశారు. మా ఆర్ టి సి కార్మికులతో పెట్టుకుంటే గత ప్రభుత్వం ఎలా ఓటమి పాలైందో ఈ ప్రభుత్వం కూడా పడిపోవడం పక్కా అని డిమాండ్ చేస్తున్నారు.

## కృష్ణ చైతన్య హాస్పిటల్‌పై దాడి

**గుంటూరు** జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కు స్వల్ప అస్వస్థత కారణంగా చిన్న శస్త్రచికిత్స జరిగింది. ఆయన వెంటనే కోలుకుని ప్రజలకు సేవ చేసేందుకు మరలా ప్రజల్లోకి వస్తున్నారని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ అన్నారు.అయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని గ్రామ పంచాయితీ లను అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. వేసవి ఎద్దడిని తట్టుకునేందుకు అన్ని గ్రామాల్లో చెరువులను నింపే కార్యక్రమం చేపట్టారు. మిర్చియార్డు లో ఉన్న సమస్యలను నివారించేందుకు కొత్త పాలకవర్గం ఎన్నుకోవటం జరిగింది. ప్రతి సంవత్సరం కోటీ నలభై లక్షల మిర్చి టిక్కీలు యార్డుకు వస్తాయి. అయితే గన్నీ బ్యాగు కు నలభై రూపాయలు చేసి రైతులకు మేలు చేసే కార్యక్రమం చేసారని అన్నారు.ఇన్నర్ రింగ్ రోడ్డు లోని కృష్ణ చైతన్య హాస్పిటల్ ను కొందరు దుండగులు దాడిచేసి విలువైన ఫర్నీచర్ లారీలో తరలించేందుకు పోయారు. ఆ సమయంలో నల్లపాడు సిఐ ఆపరిసరాల్లోనే ఉన్నారు. కానీ తేలిక పాటి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కానీ అవినీతికి అలవాటుపడిన నల్లపాడు సిఐ బాధితుల్ని రాజీపడమని బెదిరిస్తున్నారు. నల్లపాడు సిఐ దాడులు చేసేవారికి కొమ్ముకాస్తూ తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించటం లేదని అన్నారు.

కృష్ణ చైతన్య హాస్పిటల్ డాక్టర్ గొర్రె శ్రీనివాసరావు మాట్లాడుతూ 19 వ తేదీన నలభై మంది దుండగులు మాస్క్ లు వేసుకొచ్చి హాస్పిటల్స్ ను ధ్వంసం చేశారు. బిల్డింగ్ ఓనర్లతో ఎగ్రిమెంట్ చేసుకున్నాము. కానీ వెంటనే ఖాళీ చేయాలని గొడవకు దిగారు. నేను వారికి ఎటువంటి చెక్కులు ఇవ్వలేదని అన్నారు జనసేన జిల్లా అధ్యక్షులుగాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మిర్చి యార్డు నూతన పాలక వర్గం మిర్చి తెచ్చే రైతులకు లబ్ది చేకూరేలా నిర్ణయం తీసుకున్నారు. ఒక్కో టిక్కీకి రైతులకు 40 రూపాయలు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన పాలక వర్గాన్ని అభినందిస్తున్నాము. అద్దెకు ఇచ్చిన వారు ఆసుపత్రిపై దాడి చేసి సామాన్లు అన్నీ లారీలో వేసుకు వెళ్ళటం దారుణం ఆసమయంలో ఆ ప్రాంతంలో తిరిగే సిఐ బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించారు. దీనిపై ఎస్పీ చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలి. లేకుంటే జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

## నాదేండ్ల భాస్కరరావు కన్నుమూత

**హైదరాబాద్** ఉమ్మడి ఏపీ మాజీ సీఎం నాదెండ్ల భాస్కరరావు కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో కొన్ని రోజులుగా హైదరాబాద్ లోని ఆస్పత్రి ఐసియూ లో చికిత్స పొందుతున్న ఆయన బుధవారం తుది శ్వాస విడిచారు. 1984లో అప్పటి సీఎం ఎన్టీఆర్ హార్ట్ సర్జరీ కోసం అమెరికా వెళ్లినప్పుడు నెల రోజుల పాటు ముఖ్యమంత్రిగా ఉన్నారు. నెల రోజులకే ఆ ప్రభుత్వం కూలిపోయింది. రాష్ట్ర చరిత్రలో అతి తక్కువ కాలం ఆ పదవిలో ఉన్న వ్యక్తిగా నిలిచారు.

### నందిగామ మున్సిపల్ ఆఫీస్‌లో

## ఏసీబీ అధికారుల విచారణ

**నందిగామ** నందిగామ మునిసిపల్ కార్యాయంలో గతంలో జరిగిన అవినీతి ఆరోపణల పై విచారణ నిమిత్తం ఏసీబీ అధికారులు వచ్చారు. అక్రమ గ్రావెల్ పై వచ్చిన అవినీతి ఆరోపణలపై, నిధుల దుర్వినియోగంపై విచారించారు. గతంలో విధులు నిర్వహించిన ఇద్దరు మున్సిపల్ అధికారులు, ఇద్దరు కౌన్సిలర్ లు, మరో ఎనిమిది మంది మున్సిపల్ సిబ్బందిని విచారించారు. ఏసీబీ పోలీస్ ఇన్స్పెక్టర్ జి.వి.వి. సత్యనారాయణ, మున్సిపల్ ఆర్.డి.యమ్.ఏ నాగ నరసింహారావు అధ్వర్యంలో అధికారులు విచారణ చేసారు.

## ప్రధాని మోదీపై 'ఉగ్రవాది' వ్యాఖ్య

ఉన్నాయని ఈసీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. బుధవారం కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, నిర్మలా సీతారామన్, అర్జున్ రామ్ మేఘ్వాల్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్‌తో కూడిన ఉన్నత స్థాయి బీజేపీ ప్రతినిధి బృందం ఎన్నికల సంఘాన్ని కలిసి ఖర్గే వ్యాఖ్యలపై ఫిర్యాదు చేసింది. ప్రధానిపై కాంగ్రెస్ అధ్యక్షుడు విషం చిమ్మే వ్యాఖ్యలు చేశారని, రాజకీయాల్లో హద్దులు మీరేవారికి ఒక హెచ్చరికగా నిలిచేలా ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, ప్రధానిపై ఖర్గే వాడిన భాష పట్ల బీజేపీ తీవ్ర ఆగ్రహంతో, విచారంతో ఉందని తెలిపారు. "ప్రధాని మోదీని 'ఉగ్రవాది' అని పిలవడం కేవలం ఒక వ్యాఖ్య కాదు, ఇది యావత్ దేశాన్ని అవమానించడమే. ఇలాంటి నీచమైన ప్రవర్తనను సహించలేం" అని ఆయన స్పష్టం చేశారు.

## భారత్‌ను తాకితే 'డాట్ డాట్ డాట్'

సృష్టిస్తుంది. ఆ దేశం భారత్‌ను ప్రమాదంలో పడేయాలని చూస్తే మన ప్రతిస్పందన 'డాట్, డాట్, డాట్' స్థాయిలో ఉంటుంది" అంటూ పాక్ పేరు ఎత్తకుండానే రాజ్‌నాథ్ గట్టిగా హెచ్చరించారు.పహల్గాం దాడికి ప్రతీకారంగా గతేడాది మే నెలలో భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' గురించి ఆయన ప్రస్తావించారు. ఆ ఆపరేషన్‌లో భాగంగా పాక్ భూభాగంలోని 9 ఉగ్రవాద శిబిరాలను, 11 వైమానిక స్థావరాలను మన సైన్యం ధ్వంసం చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ ఇప్పుడు మన సైనిక శక్తి మరింత పెరిగిందని స్పష్టం చేశారు. ఇటీవల పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ 'కోల్‌కతాపై దాడి చేస్తాం' అంటూ చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యలపై కూడా రాజ్‌నాథ్ స్పందిస్తూ, భారత్ సార్వభౌమత్వానికి భంగం కలిగిస్తే తగిన బుద్ధి చెబుతామని పరోక్షంగా సమాధానమిచ్చారు.

## హర్మూజ్‌పై పట్టు మాదేనన్న ట్రంప్

ప్రకారం ఈ నెల 13న అమెరికా దిగ్బంధం విధించినప్పటి నుంచి ఇరాన్‌కు సంబంధమున్న కనీసం 34 ట్యాంకర్లు హర్మూజ్ జలసంధిని దాటాయి. వీటిలో 19 ట్యాంకర్లు గల్ఫ్ నుంచి బయటకు వెళ్లగా, మరో 15 గల్ఫ్‌లోకి ప్రవేశించాయి. బయటకు వెళ్లిన వాటిలో ఆరు నౌకలు సుమారు 10.7 మిలియన్ బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురును రవాణా చేస్తున్నట్లు నిర్ధారణ అయింది. దీని ద్వారా ఇరాన్‌కు దాదాపు 910 మిలియన్ డాలర్ల ఆదాయం సమకూరినట్లు అంచనా. ఇప్పటివరకు అమెరికా దళాలు కేవలం ఒక కంటైనర్ షిప్‌ను అదుపులోకి తీసుకుని, 28 నౌకలను వెనక్కి పంపినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. అమెరికా నిఘా నుంచి తప్పించుకోవడానికి ఇరాన్ నౌకలు అత్యాధునిక పద్ధతులు వాడుతున్నాయి. 'డొరెనా' అనే ఇరాన్ సూపర్‌ట్యాంకర్ తన ఉనికిని, లొకేషన్‌ను తెలిపే ట్రాన్స్‌పాండర్‌ను ఆపివేసి జలసంధిని దాటింది. ఆ తర్వాత మలేషియా తీరంలో మరో నౌకలోకి చమురును మార్పిడి చేసి, దాని మూలాలను దాచిపెట్టే ప్రయత్నం చేసింది. గతంలో అమెరికా ఆంక్షలు ఎదుర్కొన్న 'మురళీకిషన్', 'అలీసియా' వంటి ట్యాంకర్లు కూడా ఈ దిగ్బంధనాన్ని దాటి గల్ఫ్‌లోకి ప్రవేశించాయి. మరోవైపు ఇరాన్ కూడా ప్రతివ్యూహాలు రచిస్తోంది. హర్మూజ్ జలసంధి నియంత్రణ తిరిగి తమ చేతికి వచ్చిందని, జలసంధి గుండా వెళ్లే ప్రతి నౌక తమ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ నేవీ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. పౌర నౌకలకు ప్రత్యేక మార్గాన్ని నిర్దేశిస్తూ, సైనిక నౌకల రాకపోకలను పూర్తిగా నిషేధించింది. ఇటీవల ఇరాన్ దళాలు ఫ్రాన్స్, భారత్‌కు చెందిన నౌకలపై కాల్పులు జరపడం ఉద్రిక్తతలను పెంచింది. ఈ పరిణామాలతో నౌకల యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఇది ఒకవైపు అమెరికా, మరోవైపు ఇరాన్ విధించిన 'డబుల్ దిగ్బంధం'గా మారిందని వాపోతున్నారు.

## తెలంగాణలో ఆరుగురు ఐపీఎస్‌లకు డీజీ హోదా

పొందిన వారిలో అదనపు డీజీలు మహేష్ భగవత్, స్వాతి లక్రా, వీవీ శ్రీనివాసరావు, చారు సిన్హా, అనిల్ కుమార్, వీసీ సజ్జనార్ ఉన్నారు. ప్రస్తుతం మహేష్ భగవత్ లా అండ్ ఆర్డర్ అదనపు డీజీగా కొనసాగుతున్నారు. అదే సమయంలో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీగా స్వాతి లక్రా ఉన్నారు. ఇక తెలంగాణ పోలీసు నియామక మండలి చైర్మన్‌గా వీవీ శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారు. మహిళా భద్రతా విభాగం, సీఐడీ, ఏసీబీ ఏడీజీగా చారు సిన్హా విధుల్లో ఉన్నారు. గ్రేహౌండ్స్ ఏడీజీగా అనిల్ కుమార్ కొనసాగుతున్నారు. ఇక ప్రస్తుతం హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా వీసీ సజ్జనార్ ఉన్నారు. ఈ ఆరుగురు ఐపీఎస్ అధికారులకు ప్రమోషన్లు లభించినప్పటికీ ఇప్పటికిప్పుడు వారి స్థానాలు మారడం లేదని ప్రభుత్వం తెలిపింది. పదోన్నతులు పొందినప్పటికీ తర్వాతి ఉత్తర్వులు వెలువరించే వరకు ఈ ఆరుగు ఐపీఎస్ అధికారులు ప్రస్తుతం ఉన్న బాధ్యతలనే నిర్వర్తించనున్నారు.

## పీసీ ఘోష్ కమిషన్ కాదు పీసీసీ నివేదిక

కేసీఆర్ చరిత్రను ఎవరూ చెరపలేరని అన్నారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో అందరికీ అసలు విషయం తెలిసిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు కచ్చితంగా వరప్రదాయిని అన్నారు. రూ.94 వేల కోట్లు ఖర్చయితే రూ.1 లక్ష కోట్లు అని ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం అంటే ఒక్క బ్యారేజీ కాదని, మూడు బ్యారేజీలు అని తెలిపారు. కాంగ్రెస్ చేసిన కుట్రల వల్ల మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని ఆరోపించారు. రాష్ట్రంలో చెక్ డ్యాంలు బాంబులు పెట్టి పేలుస్తుంటే కేంద్రం ఏం చేస్తోందని ప్రశ్నించారు.

## మరో సకల జనుల సమ్మె!

నోటీసు ఇచ్చినా డిమాండ్లను నెరవేర్చకుండా కేవలం కాలయాపన కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ అధికారుల కమిటీ వేసిందని విమర్శలు చేశారు. తమకు కమిటీ అవసరం లేదని వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని జేఏసీ ఛైర్మన్ డిమాండ్ చేశారు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛందంగా ఆర్టీసీ కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారని స్పష్టం చేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేసే ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకూ సమ్మె ఆపేది లేదని స్పష్టం చేశారు. మందకృష్ణ మాదిగ, బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్య తమ సమ్మెకు మద్దతు ఇస్తున్నారని తెలిపారు. మరోవైపు ఆర్టీసీ సమ్మె కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించడంతో వారు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు.

## కేసీఆర్, హరీష్ రావులకు హైకోర్టులో ఊరట

సరైనది కాదని పిటిషనర్ల తరపు న్యాయవాదులు హైకోర్టులో తమ వాదనలు వినిపించారు. దీనికి భిన్నంగా, ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదిస్తూ కాళేశ్వరం ప్రాజెక్టులో బ్యారేజీల వైఫల్యాలపై పూర్తిస్థాయి వాస్తవాలను వెలికితీసేందుకు, విస్తృత ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే ఈ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేశామని కోర్టుకు వివరించారు. ఇరు వైపుల వాదనలను విన్న ధర్మాసనం ఘోష్ కమిషన్ నిబంధనలు పాటించలేదని, ఆ రిపోర్ట్ ఆధారంగా ఎలాంటి చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ పేరుతో ప్రభుత్వం తమను రాజకీయంగా వేధించేందుకే జస్టిస్ ఘోష్ కమిషన్‌ను అడ్డం పెట్టుకుందని మాజీ సీఎం కేసీఆర్ విమర్శించారు. అభివృద్ధి చేయడమే బీఆర్ఎస్ చేసిన తప్పా.. రైతులకు సాగునీళ్లు ఇవ్వాలని చూసినందుకు అవినీతి ఆరోపణలు చేయడం తగదన్నారు. ప్రాజెక్టులో చిన్న లోపాలు తలెత్తితే వాటిని సరిచేయడం మానేసి, మొత్తం ప్రాజెక్టే పనికిరాదని దుష్ప్రచారం చేయడం రాష్ట్ర ప్రయోజనాలకు, రైతులకు నష్టమని ఆయన మండిపడ్డారు. నిబంధనలకు విరుద్ధంగా విచారణ జరిపి తమ పరువు ప్రతిష్టలు దెబ్బతీయాలని ప్రయత్నిస్తూ చూస్తూ ఊరుకునేది లేదన్నారు. 38 వేల కోట్లు కావాల్సిన ప్రాజెక్టును ఏరియా మార్చి, కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో బ్యారేజీలు కట్టి ఖర్చును 1 లక్షా 50 వేల కోట్లకు పెంచి కమీషన్లు తీసుకున్నారని, అవినీతికి పాల్పడ్డారని సీఎం రేవంత్ ఇటీవల ఆరోపించారు. ఈ కేసుకు సంబంధించి సీబీఐ దర్యాప్తు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని పలుమార్లు డిమాండ్ చేశారు.

## జస్టిస్ ఘోష్ రిపోర్టుపై ప్రభుత్వం తర్జన భర్జన

8బి ప్రకారం, నివేదికలో ఎవరినైనా బాధ్యులుగా పేర్కొనే ముందు వారి వివరణ కోరడం తప్పనిసరి. అయితే, సదరు నిందితుల వాదన వినకుండానే దోషులుగా తేల్చడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సాంకేతిక లోపం కారణంగా నివేదికలోని చర్యల భాగం ప్రస్తుతానికి అమలుకు వీలులేనిదిగా మారిపోయింది, ఇది బీఆర్ఎస్ అగ్రనేతలకు పెద్ద ఊరటనిచ్చింది. ప్రభుత్వానికి ఈ తీర్పు కొంత మేర చేదును మిగిల్చినప్పటికీ, మరో కోణంలో చట్టబద్ధమైన విజయాన్ని అందించింది. కాళేశ్వరం అక్రమాలపై విచారణకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 6ను హైకోర్టు సమర్థించింది. కమిషన్ ఏర్పాటులో ఎటువంటి రాజ్యాంగ ఉల్లంఘనలు లేవని, అవకతవకలపై విచారణ జరిపే పూర్తి అధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేసింది. దీనివల్ల కమిషన్ నిర్వహించిన విచారణ ప్రక్రియకు గుర్తింపు లభించినట్లయింది, ఇది భవిష్యత్తులో ప్రభుత్వం తీసుకునే తదుపరి చర్యలకు ఒక బలమైన పునాదిగా నిలుస్తుంది. విచారణ చట్టబద్ధతను కోర్టు అంగీకరించడం బీఆర్ఎస్ పార్టీకి ఆందోళన కలిగించే అంశం. మరోవైపు, అక్రమాలను నిరూపించే నివేదిక ఉన్నప్పటికీ, ప్రక్రియ లోపాల వల్ల రాజకీయంగా మైలేజ్ పొందలేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతిబంధకంగా మారింది. హైకోర్టు లేవనెత్తిన సాంకేతిక అంశాలపై వెనక్కి తగ్గకూడదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సాక్ష్యాధారాలతో కూడిన కమిషన్ నివేదికను కేవలం నోటీసుల కారణంతో పక్కన పెట్టడం సరికాదని న్యాయ నిపుణులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది.

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



జగిత్యాల/ బుగ్గారం :22 ఏప్రిల్ (తెలంగాణ వాణి విలేకరి) జగిత్యాల జిల్లా బుగ్గారం మండలంలోని యశ్వంతరావుపేట ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రఘునందన్ ఆధ్వర్యంలో 5 వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక డ్రెస్ కోడ్ తో ఆన్లైన్ ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నే నాణ్యమైన విద్య అందుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్ కుమార్, సి ఆర్ పి పురుషోత్తం, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నిరుపేదల సొంతింటి కల సహకారం

**-మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్**



నర్సంపేట: ఏప్రిల్ 22(తెలంగాణ వాణి ప్రతినిధి) నర్సంపేట పట్టణ పరిధిలోని 9వ వార్డు స్థానికులు ఆకుతోటకళావతికుశాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి సహకారంతో మంజూరైన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వారి సొంతింటి కల నెరవేరిన సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేసిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ...పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని,ప్రతి పేద కుటుంబానికి ఇల్లు ఉండాలని ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్నికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు..ప్రజాపాలనలో భాగంగా వచ్చిన ఇళ్ల దరఖాస్తులను పరిశీలించి, విడతల వారీగా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుంది అని తెలిపారు. ఇది ప్రజా ప్రభుత్వమని, పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , స్థానిక శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి కి ఎల్లవేళల రుణపడి ఉంటామనితెలియజేస్తూ, మున్సిపల్ చైర్ పర్సన్ నీ శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకుబ్ రెడ్డి, మాజీ పట్టణ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బండి రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొల్లూరి మధుకర్, కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు మెర్గు కిరణ్, ఉప్పల శాలూమ్, దేవోజు హేమంత్, మైదం రాకేష్, చీకటి శివమణి తదితరులు పాల్గొన్నారు..

# ఘనంగాపోషణ పక్వాడ కార్యక్రమం




హుజూర్ నగర్ ఏప్రిల్ 22 తెలంగాణ వాణి హుజూర్ నగర్ సెక్టార్ హుజూర్ నగర్ ఏడవ సెంటర్ పరిధిలోని ఘనంగా పోసిన పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించరూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ హాజరై నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలలో పెరుగుతున్న స్క్రీన్ టైమ్‌ను తగ్గించేందుకు మరియు ఆరోగ్యకరమైన డిజిటల్ అలవాట్లను ప్రోత్సహించేందుకు ఈ రోజు పోషణ పక్వాడ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. “తల్లిదండ్రులు మరియు సమాజం పాత్ర” అనే అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు మరియు గ్రామ పంచాయతీలలో కౌన్సెలింగ్ సెషన్స్ నిర్వహించి, అధిక స్క్రీన్ వినియోగం వల్ల కలిగే మానసిక మరియు శారీరక సమస్యలను తల్లిదండ్రులకు వివరించారు. పిల్లల వయస్సుకు అనుగుణంగా స్క్రీన్ టైమ్ పరిమితులు పాటించాలని సూచించారు.అదేవిధంగా, వీడియో సందేశాల ద్వారా సురక్షిత డిజిటల్ వినియోగంపై అవగాహన కల్పించారు. పిల్లలకు చదువు, ఆటలు, కథలు చెప్పడం వంటి ప్రత్యామ్నాయ కార్యకలాపాలను ప్రోత్సహించారు.గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు కలిసి పిల్లల అభివృద్ధిలో తమ బాధ్యతను గుర్తించి కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా పిల్లల ఆరోగ్యకరమైన జీవనశైలికి బాటలు వేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే అన్నప్రాసన అక్షరాభ్యాస కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో హుజూర్ నగర్ సెక్టర్ సూపర్వైజర్ సోమమ్మ పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ రాజేష్, ఏఎన్ఎం ఆశా కార్యకర్తలు అంగన్వాడి టీచర్లు బెన్ఫిషరీస్ పాల్గొన్నారు

# రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి

**- కలెక్టర్ చిత్రా మిశ్రా**



చిగురుమామిడి ఏప్రిల్ 22 ( తెలంగాణ వాణి విలేఖరి ) కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం,యాసంగి ధాన్యం కొనుగోళ్లకు కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, రైతులకు ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం చిగురుమామిడి మండలం పీచుపల్లి, లంబాడిపల్లి గ్రామాల్లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను, కలెక్టర్, ఆర్డీవో మహేశ్వర్, సివిల్ సప్లై ఆఫీసర్ నర్సింగరావు, డీఎం రజనీకాంత్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాగునీరు, నీడ వంటి వసతులు కల్పించాలని అన్నారు. అకాల వర్షాల కారణంగా ఎటువంటి నష్టమూ వాటిల్లకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో తూకం, తేమయంత్రాలు సరిగ్గా పనిచేసేలా చూడాలని, ఎక్కడైనా మరమ్మతులకు గురైతే వెంటనే మరొకటి ఏర్పాటు చేయాలని అన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా వీలైనంత మేర ఉదయం, సాయంత్రం వేళల్లో కొనుగోలు చేపట్టాలన్నారు. రైతులు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మెడికల్ కిట్లు, ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, ఏఎన్ఎం సేవలు అందుబాటులో ఉండాలని అన్నారు. గత ఏడాది కొనుగోలు కేంద్రాల్లో రోజువారీగా ధాన్యం కొనుగేళ్ల గణాంకాలను పరిశీలిస్తూ ప్రస్తుత యాసంగి కొనుగోళ్లకు అదేవిధంగా సన్నద్ధం కావాలని సూచించారు.మండలాల వారీగా ధాన్యం కొనుగోళ్లను మండల ప్రత్యేక అధికారులు, రెవిన్యూ, సివిల్ సప్లై అధికారులు సంయుక్తంగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి ఏర్పాట్లు పర్యవేక్షించాలని, కొనుగోళ్ల రిజిస్టర్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడుతూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని అన్నారు, వ్యవసాయ మార్కెట్ కమిటీ సమన్వయంతో కొనుగోలు పూర్తయిన ధాన్యం త్వరితగతిన మిల్లింగ్ కోసం వెళ్లేలా చూడాలని, కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. ఈ సందర్భంగా ధాన్యం కుప్పలు, రికార్డులు పరిశీలించి.. సిబ్బందికి పలు సూచనలు చేశారు. యంత్రంతో ధాన్యంలోని తేమశాతం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని డీసీఎస్వోను ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,లంబాడి పల్లె సర్పంచ్ కాటమ్ సంపత్ రెడ్డి, ఫీచు పల్లె సర్పంచ్ పీచు సత్యనారాయణ రెడ్డి, పోటు మల్లారెడ్డి,తహసిల్దార్, రమేష్, ఎంపీడీవో విజయ్ కుమార్ ,వివిధ శాఖల అధికారులు,రైతులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారం ఐటిడిఏ నూతన ఏపీఓను సన్మానించిన తుడుందెబ్బ నాయకులు

**గిరిజన అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలి**

**సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చిన ఐటీడీఏ ఏపిఓ కొమురం నాగరావు**



ఏటూరునాగారం,ఏప్రిల్22(తెలంగాణ వాణి):ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటిడిఏలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏపీఓ కొమురం నాగరావుని తుడుందెబ్బ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలతో ఘనంగా సన్మానించి శాలువాతో సత్కరించి తమ అభినందనలు తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ఆయన తీసుకోబోయే చర్యలు ప్రజలకు మేలు చేస్తాయని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ నాయకులు మాట్లాడుతూ,ఏజెన్సీ ప్రాంతాల్లో విద్య,వైద్యం,రహదారులు,తాగు నీటి వంటి ప్రాథమిక సమస్యలు ఇంకా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయని వివరించారు. ముఖ్యంగా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, ఆశ్రమ పాఠశాలల పరిస్థితిని మెరుగుపరచడం, ఐటిడిఏ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడం అత్యవసరమని కోరారు.ఏపీఓ కొమురం నాగరావు స్పందిస్తూ,గిరిజనుల అభ్యున్నతే తన ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు తాటి నీలాద్రి, జిల్లా కోశాధికారి సోలం సురేష్, మండల ప్రధాన కార్యదర్శి ఈసం పణికుమార్, ఉపాధ్యక్షులు కోరం సుధాకర్, చింత లక్ష్మణ్ స్వామి, బొగ్గం శివకుమార్, పలక నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# డిహెచ్ పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా పొన్నగంటి లావణ్య ఎన్నిక.



భూపాలపల్లి (తెలంగాణ వాణి ప్రతినిధి ) దళిత హక్కుల పోరాట సమితి రెండవ రాష్ట్ర మహా సభలు ఏప్రిల్ 17, 18 వరంగల్ లో జరిగినవి. ఈ మహా సభల లో భూపాలపల్లి జిల్లా రాష్ట్ర సమితి లో ప్రాధాన్యత దక్కింది. పొన్నగంటి లావణ్య ఉపాధ్యక్షురాలిగా ఎన్నిక గా, రాష్ట్ర సమితి సభ్యులుగా రాస పెల్లి భద్రయ్య ఎన్నిక అయ్యారు.దళిత హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తున్న డి హెచ్ పి ఎస్ రాష్ట్ర స్థాయి బాధ్యతల్లో భాగంగా, ప్రముఖ సామాజిక కార్యకర్త పొన్నగంటి లావణ్యను రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.పొన్నగంటి లావణ్య గారు గత కొంతకాలంగా దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కుల కోసం అహర్నిశలు కృషి చేస్తూ, పేదల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. గ్రామీణ స్థాయిలో మహిళల సాధికారత, దళితుల భూమి హక్కులు, విద్యా అవకాశాలు వంటి అనేక అంశాలపై ఆమె చేసిన ఉద్యమాలు ప్రశంసనీయమైనవి.ఈ సందర్భంగా డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పొన్నగంటి లావణ్య గారు మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, దళితుల హక్కుల కోసం మరింత కట్టుదిట్టంగా పోరాడుతానని, సమానత్వ సమాజ నిర్మాణమే తన లక్ష్యమని పేర్కొన్నారు. నా ఎన్నికకు సహకరించిన జాతీయ, రాష్ట్ర కమిటీకి సీపీఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ గారికి కృతజ్ఞతలు తెలిపారు.

# బొమ్మారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాల లో ఘనంగా వార్షికోత్సవం



ధర్మారం:ఏప్రిల్ 22(తెలంగాణ వాణి ) ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన పాఠశాల వార్షికోత్సవం 7 వ తరగతి విద్యార్థుల వీడుకోలు మరియు ఎఫ్ ఎల్ ఎన్ రీడింగ్ చాంపియన్ జిల్లా స్థాయి పెద్దపల్లి ప్రథమస్థానం పొందిన 2 వ తరగతి విద్యార్థిని పెసరి ఆరాధ్య అభినందన సభ కార్యక్రమానికి ముఖ్య అథితులుగా ఎంఈఓ పోతు ప్రభాకర్, గ్రామ సర్పంచ్ దార రాజ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఎంఈఓ పాఠశాల విద్యార్థులను, ఉపద్యాయులను అభినందించారు . గ్రామ సర్పంచ్ దార రాజ్ కుమార్ పెద్దపల్లి జిల్లా రీడింగ్ చాంపియన్ పోటీలలో మొదటి బహుమతి పొందిన పెసరి అరద్యాను అభినందిస్తూ ఆమెకు సైకిల్ ను అందించారు.ఇక ముందు కూడా క్రమ శిక్షణతో పాఠశాలకు మరియు గ్రామానికి పేరు తేవాలని సర్పంచ్ అన్నారు . ఈ కార్యక్రంలో ఉప సర్పంచ్ , వార్డు సభ్యులు ఉపాద్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఈత సరదా విషాదంగా మారకుండా జాగ్రత్త పడుదాం

**మైనర్‌లకు వాహనాలు ఇవ్వొద్దు**

**చిన్న నిర్లక్ష్యం ప్రాణ నష్టానికి దారితీయవచ్చు**

**వేసవి సెలవుల దృష్ట్యా పిల్లల కదలికలు తల్లిదండ్రులు**

**ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి**

**జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.**




రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 22 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) : వేసవికాలంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు రావడంతో పిల్లలు,యువకులు ఈత నేర్చుకోవడానికి చెరువులు, కాలువల వద్దకు వెళ్లే అవకాశం ఎక్కువగా ఉంటుంది.ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరిగి నీటిలో మునిగి ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నందున ఇట్టి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈత సరదా విషాదంగా మారకూడదు అని జిల్లా ఎస్పీ సూచించారు.ఈత రానివారు బావులు, చెరువులు, కాలువల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని సూచించారు. ఈతను నేర్చుకునే వారు తప్పనిసరిగా తల్లిదండ్రుల సమక్షంలోనే నేర్చుకోవాలని,ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువులు, కాలువలు, కుంటల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచించారు.ఏదైనా అనుకోని సంఘటనలు చోటుచేసుకుంటే పిల్లల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉన్నందున ఈ విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు.

## మైనర్లకు వాహనాలు ఇవ్వకండి :

జిల్లా వ్యాప్తంగా మైనర్ డ్రైవింగ్ లపై ప్రత్యేక శ్రద్ధ ఉంచడం జరిగిందని తల్లిదండ్రులు మైనర్లకు వాహనం ఇవ్వకూడదని, వాహనం ఇచ్చినచో వారు తెలిసి తెలియని డ్రైవింగ్ తో వాహనం నడపటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, దానితో వారికి మరియు ఎదుటి వ్యక్తులకు ప్రమాదం జరగటం వల్ల రెండు కుటుంబాలు నష్ట పోతున్నాయని కావున మైనర్ లకు వాహనాలు ఇవ్వకూడదని, ఒకవేళ మైనర్ కు వాహనం ఇచ్చి ఏదైనా ప్రమాదం జరిగిన లేదా మైనర్ డ్రైవింగ్ చేస్తూ వాహనం తో పట్టుబడిన వాహన యజమాని పై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

# మున్నూరు కాపు కళ్యాణ మండపం ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ విప్



వేములవాడ,ఏప్రిల్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి) : వేములవాడలో నూతనంగా నిర్మించిన మున్నూరు కాపు కళ్యాణ మండపాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆది శ్రీనివాస్ కు సంఘం సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ, “కులం అంటే బలం, బలగం” అని పేర్కొన్నారు. ఈ మండప నిర్మాణానికి కృషి చేసిన ప్రతి ఒక్కరిని ఆయన అభినందించారు.అలాగే ఈ కళ్యాణ మండపం నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మున్నూరు కాపు ఐక్యతకు తన వంతు సహకారం ఎప్పటికి ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్,సత్రం అధ్యక్షులు కోయినేని బాలయ్య, మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్యతో పాటు సంఘం సభ్యులు,కౌన్సిలర్లు,నాయకులు పాల్గొన్నారు.

# పవర్ లూమ్స్ కార్మికుల సమస్యల గురించి

# గుత్త సుఖేందర్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చిన నాయకులు

రాజపేట ఏప్రిల్: 22(తెలంగాణ వాణి విలేఖరి) యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన పద్మశాలి నాయకులు బుధవారం హైదరాబాద్ లోని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ని వారి స్వగృహంలో కలిసి చేనేత పవర్లూమ్స్ కార్మికుల సమస్యల గురించి వినతి పత్రం అందజేసిన, రఘునాథపురం మాజీ సర్పంచ్ గాడి పెల్లి శ్రవణ్ కుమార్ నేత, రాష్ట్ర యువజన సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ సామల భాస్కర్ నేత, లు పవర్ లూమ్స్ త్రిఫ్ట్ పథకం సమస్య గురించి చేనేత పవర్ లూమ్స్ కార్మికుల రుణమాఫీ,ఉచిత కరెంటు గురించి వినతి పత్రం అందజేసి సమస్యను వివరించారు.పవర్లూమ్ కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిఫ్ట్ పథకం మే 2025 ముగిసింది. త్రిఫ్ట్ పథకం ముగిసి 11 నెలలు అవుతున్న ఇంకా ప్రారంభం కాలేదని త్రిఫ్ట్ పథకం ప్రారంభం చేసే విధంగా సీఎంతో చేనేత జౌళిశాఖ మంత్రి తో మాట్లాడి వెంటనే తిరిగి త్రిఫ్ట్ పథకం ప్రారంభించాలని త్రిఫ్ట్ పథకం చేనేత కార్మికులకు 8% డిపాజిట్ చేస్తే వారి ఖాతాకు ప్రభుత్వం16% జమ చేయుచున్నది 1200 జమ చేస్తే 2400 ఇస్తుంది) అదే మాదిరిగా పవర్లూమ్ వారికి జమ చేయాలని కోరారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ లో మర మగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేసింది. తమిళనాడులో మర మగ్గాలకు750 యూనిట్లు ఫ్రీ గా ఇస్తున్నారని,అదేవిధంగా మన తెలంగాణలో కూడా ప్రభుత్వం అమలు చేయాలని పవర్ లూమ్ కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించి పై సమస్యలు గురించి వెంటనే ఫోన్లో సీఎం రేవంత్ రెడ్డి తో చేనేత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో ఫోన్లో మాట్లాడారు. త్రిఫ్ట్ పథకం అతి త్వరలో ప్రారంభించే విధంగా అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మరో 10 నుండి 15 రోజుల్లో త్రిఫ్ట్ పథకం ప్రారంభిస్తామని శాసనమండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డి కి సీఎం తెలిపారు. ఈ సందర్భంగా వారిని చేనేత శాలువాతోసన్మానించి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రఘునాథపురం మాజీ సర్పంచ్ గాడి పెల్లి శ్రవణ్ కుమార్ నేత, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి యువజన సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ సామల భాస్కర్ నేత, పద్మశాలి నాయకులు లెగిసెట్టి సత్యనారాయణ లు తదితరులు పాల్గొన్నారు.



# పారదర్శకంగా అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ చేయాలి

**నిజాన్ని వెలికి తీయాలి అబద్ధాన్ని స్వాగతించవద్దు**

**ప్రతి దరఖాస్తును కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించాలి**

**నిజమైన అర్హత గల జర్నలిస్టులకు కార్డులు అందాలి**



మెదక్ (తెలంగాణ వాణి ప్రతినిధి) మెదక్ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశంలో జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్పర్సన్ కలెక్టర్ ప్రతిమా సింగ్ నిజమైన అర్హత గల జర్నలిస్టుల కే అక్రిడేషన్ కార్డు అందాలని జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్ పర్సన్, కలెక్టర్ ప్రతిమా సింగ్ జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులకు సూచించారు బుధవారం కలెక్టరేట్లోని మీ సమావేశ మందిరంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్ పర్సన్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధ్యక్షతన జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు డిపిఆర్ఓ అధికారులతో సమావేశం నిర్వహించారు ముందుగా నూతనంగా నియామకమైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు దరఖాస్తులు ఎన్ని వచ్చాయో అని డిపిఆర్ఓ ను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తు విధానం అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ చైర్ పర్సన్ కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న మీడియా ప్రతినిధులకు అక్రిడియేషన్ కార్డుల జారీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిష్పక్షపాతంగా అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ జరగాలన్నారు ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వ కార్యక్రమాలు సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో మీడియా ఒక ప్రధాన వేదికగా ఉంటుందనీ పేర్కొన్నారు. అందువల్ల మీడియా ప్రతినిధుల గుర్తింపు ప్రక్రియలో ఎలాంటి వివక్ష లేకుండా నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందినీ అక్రిడిటేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల ద్వారా సమగ్రంగా పరిశీలించి అర్హత ప్రమాణాలు పూర్తిచేసిన అభ్యర్థులకు మాత్రమే కార్డులు జారీ చేయాలన్నారు ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం ఖచ్చితంగా పరిశీలించడంతో పాటు అవసరమైన పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో తనిఖీ చేయాలనీ కమిటీ సభ్యులకు సూచించారు. ఎటువంటి అనర్హులుకు కార్డులు జారీ కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే అభ్యంతరాల స్వీకరణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి వచ్చిన ఫిర్యాదులను సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు మీడియా ప్రతినిధులు సమర్పించే దరఖాస్తుల్లో వృత్తి సంబంధిత ప్రమాణాలు, అనుభవం సంస్థ గుర్తింపు వంటి అంశాలను ప్రధానంగా పరిగణలోకి తీసుకోవాలనీ తేల్చి చెప్పారు నకిలీ ధృవపత్రాలు సమర్పించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటమన్నారు అక్రిడిటేషన్ కార్డులు పొందిన మీడియా ప్రతినిధులు తమ వృత్తి నైతిక విలువలను పాటిస్తూ సమాజానికి బాధ్యతాయుతంగా సేవలందించాలన్నారు ప్రజలకు నిజమైన సమాచారం అందించడం ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రచారం చేయడం సామాజిక సమస్యలను వెలుగులోకి తీసుకురావడం వంటి అంశాల్లో మీడియా తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలనీ జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలన్నారు ప్రతి దశలో పారదర్శకతను పాటిస్తూ ఎటువంటి వివాదాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు డిప్యూటీ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ భూపాల్ కమిటీ సభ్యులు అశోక్ గోపాల్ గౌడ్ దేవరాజ్, శ్రీధర్ ఫరూక్ హుస్సేన్ శంకర్ దయాల్ చారి సురేందర్ రెడ్డి నాగరాజు శ్రీనివాస చారి ఏపీఆర్ఓ బాబురావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# జనగణన కార్యక్రమం జాగ్రత్తగా నిర్వహించాలి:జిల్లా కలెక్టర్





మంచిర్యాల,ఏప్రిల్ 22 (తెలంగాణ వాణి) జనగణన -2027 కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఇండ్ల గణనపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి మండల తహసిల్దార్ మల్లికార్జున్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఇండ్ల గణన కార్యక్రమాన్ని నిబంధనల ప్రకారం చేపట్టాలని, జిల్లాలో గుర్తించబడిన ఇండ్ల జాబితా బ్లాక్ వివరాలను అందించడం జరుగుతుందని తెలిపారు. మే 11వ తేదీ నుండి నిర్వహించనున్న ఇండ్ల గణన కార్యక్రమాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు. రోజురోజుకు ఉష్ణోగ్రత తీవ్రమవుతున్న దృష్ట్యా ఉదయం వేళలో ప్రక్రియ నిర్వహించేలా కార్యచరణ రూపొందించుకోవాలని తెలిపారు. తమ జాబితాలోని ఇండ్ల గణన కొరకు ముందుగా ఆయా ఇండ్ల యజమానులకు సమాచారం అందించినట్లయితే సమయానికి అందుబాటులో ఉంటారని, పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కమిషనర్ సమన్వయంతో ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు సమయపాలన పాటించాలని, ఇండ్ల గణన కొరకు నియమించబడిన అధికారులు ఎన్నికల విధులు నిర్వహించారని, అనుభవంతో ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. మాస్టర్ ట్రైనర్లు అందిస్తున్న శిక్షణలో ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే నివృత్తి చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో ప్రక్రియ నిర్వహించే సమయంలో తలెత్తే సందేహాల నివృత్తి కొరకు గ్రూప్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణకు హాజరు కాని వారు తరువాత ఏర్పాటు చేసే శిక్షణ కార్యక్రమానికి హాజరై ఇండ్ల గణన ప్రక్రియపై అవగాహన పొందాలని తెలిపారు. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, ఎన్నికల నిర్వహణ జనగణన పై ఆధారపడి ఉంటుందని, ఈ నేపథ్యంలో ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అంతకుముందు మండలంలోని కిష్టంపేటలో గల డిగ్రీ కళాశాల లో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. చెన్నూర్ పట్టణంలో చేపట్టిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణ పనులను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులలో భాగంగా ప్రహరీ గోడ నిర్మాణాన్ని పరిశీలించి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం లో చేపట్టిన అదనపు గదుల నిర్మాణం, భోజనశాల, వంటశాల లను పరిశీలించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎం పి ఎస్ ఓ ప్రవీణ్ కుమార్, ఫీల్డ్ ట్రైనర్లు సురేందర్, గోపికృష్ణ, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్



మంచిర్యాల (తెలంగాణ వాణి) భూమి అభివృద్ధిలో భాగంగా వెంచర్ల ఏర్పాటు కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో వెంచర్ ఏర్పాటు కొరకు అందిన దరఖాస్తులకు సంబంధించి భూమిని పట్టణ ప్రణాళిక అధికారి సంపత్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అనేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వెంచర్ల కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులను సరిచూసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు రానీయం

## కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ (తెలంగాణ వాణి) ఆర్టీసీ సమ్మెతో ప్రజలకు ఎలాంటి ప్రయాణ ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నట్లు మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఆర్టీసీ సమ్మె దృశ్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పని చేస్తాం అన్నారు. ప్రైవేట్ వాహనదారులు ఎక్కువ ఛార్జ్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎమర్జెన్సీ అవసరాల కోసం కంట్రోల్ నెంబర్ 9391942254 ఏర్పాటు చేశామని, ఆర్టీసీ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి చేపట్టిన సమ్మె వల్ల జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు. సమ్మెతో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలోని మెదక్, నర్సాపూర్ బస్ డిపోల నుంచి బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. మెదక్ నుంచి 100, నర్సాపూర్ నుంచి 34 బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. రెండు బస్ డిపోల పరిధిలో కొత్తగా కండక్టర్ లను నియమిస్తున్నామని, అదే విధంగా గతంలో ఆర్టీసీ డ్రైవర్ ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారిని పరిశీలించి తీసుకుని వారి సేవలు వినియోగించుకుంటున్నామన్నారు. పోలీస్, రెవెన్యూ, రవాణా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రైవేట్ స్కూల్స్, కంపెనీల వారిని సహకరించాలని కోరడం జరిగిందని వారి సహకారంతో ప్రజల అవసరాల మేరకు వారికి బస్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎమర్జెన్సీ అవసరాల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అవసరం ఉన్నవారు 9391942254 నంబర్ లో సంప్రదించాలని కోరారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని ఎవరైనా ప్రైవేట్ వాహనదారులు అధిక ఛార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఆర్ఓ రామచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

# చేసిన సేవలే గుర్తింపు నిస్తాయి

## తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్



పటాన్ చెరు, ఏప్రిల్ 22, (తెలంగాణ వాణి రిపోర్టర్) విధి నిర్వహణ లో చేసిన సేవలే పదవీ విరమణ అనంతరం గుర్తింపు నిస్తాయినీ పటాన్ చెరు డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం నాడు పట్టణం లోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల ప్రధానోధ్యాయురాలు శంకరంపేట విజయ సంగయ్య గౌడ్ పదవి విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ విజయ సంగయ్య గౌడ్ చేసిన సేవలు గుర్తు చేశారు అనంతరం ఆమెను శాలువాతో సన్మానించి పదవి విరమణ శుభాకాంక్షలు తెలియ జేశారు. ప్రైవేటు పాఠశాలలో చదివితేనే ఉన్నతమైన విద్య సాధ్యమనే అపోహను దూరం చేస్తూ, ప్రభుత్వ పాఠశాలలలో కూడా ఉన్నత విద్య సాధ్యమని నిరూపించే వారిలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ ఒకరని అన్నారు. నేటి బాలలే రేపటి పౌరుల ని వారి ఉన్నతమైన భవిష్యత్తు నేటి ప్రాథమిక చదువు లోనే సాధ్యమని విశ్వసించి బాల బాలికలకు అత్యున్నత విద్యను అందించేందుకు అహర్నిశలు కృషి చేసిన విజయ మనస్ఫూర్తిగా పదవి విరమణ శుభాకాంక్షలు తెలియ జేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా మండల విద్యాధికారి నాగేశ్వర్ నాయక్, సంగారెడ్డి జిల్లా పీ ఆర్ టీ యు టీ ఎస్ సంఘం అధ్యక్షుడు ఆకుల మానయ్య, ప్రధాన కార్యదర్శి ప్రభు. మండల శాఖ బాధ్యులు మహారెడ్డి విఠల్ రెడ్డి, ప్రకాష్. రామానుజం, ధన రాజ్. శ్రీనివాస్, శ్రీకర్. జిన్నారం, గుమ్మడిదల మండలాల సంఘం బాధ్యులు పవన్, తదితరులు పాల్గొన్నారు. ఇంకా ఆల్విన్ కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ, స్థానిక నేతలు కార్ రాజు, అజ్మత్ అజ్జు, అఫ్జల్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నస్రీన్ సుల్తానా, అమరేందర్ రెడ్డి, సంగీత, పద్మ ప్రసాద్, జీవన లత, జ్యోత్స్న, శబరి, రమేశ్, ఖాజా కార్టూన్. సబీయా పర్వీన్, అమ్మ ఆదర్శ కమిటి చైర్మెన్ తులసమ్మ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకే అక్రిడిటేషన్లు

# నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ఆదిలాబాద్, ఏప్రిల్ : 22 ( తెలంగాణ వాణి ప్రతినిధి) జిల్లాలో నిబద్ధతతో పనిచేస్తున్న నిజమైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. నూతనంగా ఏర్పాటైన జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్‌కు పూల మొక్కను అందించి, మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని, అర్హత గల ప్రతి విలేకరికి కార్డు అందేలా చూడాల్సిన బాధ్యత జిల్లా పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ), కమిటీ సభ్యులపై ఉందన్నారు. అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవోలోని మార్గదర్శకాలను కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. ముఖ్యంగా క్రిమినల్ నేపథ్యం ఉన్న వ్యక్తులు, ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి కార్డులు జారీ చేయకూడదని ఆయన ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని, త్వరలోనే జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ పూర్తిస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఇ. విష్ణువర్ధన్, కమిటీ సభ్యులు నూకల దేవేందర్, బేత రమేష్, బిర్కుర్వార్ వెంకటేష్, మహమ్మద్ హమీదుల్లా అన్వర్, పి.గజానన్, మెడపట్ల సురేష్, తోట్ల చిన్న అంజయ్య, బి.కిరణ్ కుమార్ జి.వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# కార్పోరేట్ కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు



మందమర్రి టౌన్ ఏప్రిల్ 22 (తెలంగాణ వాణి విలేకరి) విద్యార్థుల సర్వతో ముఖా భివృద్ధికి ప్రభుత్వ ఉపా ధ్యాయులు కృషి చేస్తున్నా రని కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభు త్వ పాఠశాలలు కొన సాగుతున్నాయని మండల విద్యాధికారి రాథోడ్ రమేష్ పేర్కొన్నారు. పట్టణం లోని ఫిల్టర్ బెడ్ ప్రాథమిక పాఠశాలలో కాన్వొకేషన్ డే ఉత్సవాలను బుధవా రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండ ల విద్యాధికారి రాథోడ్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతమైన జ్ఞాన నిర్మా ణం కోసం ఉపాధ్యాయు లు కృషి చేస్తున్నారని, విద్యార్థులు సర్వతో ముఖాభివృద్ధిని సాధిస్తు న్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఐదో తరగతి విద్యార్థులకు ఉత్తీర్ణత పత్రాలు అందజేశారు. ఫిల్టర్ బెడ్ ప్రభుత్వ పాఠ శాల ఉపాధ్యాయుల కృషి వలన నేడు దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందడమే కాకుండా నాణ్యమైన మెరుగైన విద్యను పిల్లల కు అందించడంలో ముందంజలో ఉందని కొనియాడారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి, విద్యార్థుల అభివృద్ధి కోసం చేస్తున్న కార్యక్ర మాలు అభినందనీ యమని ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరు కాగ, విద్యార్థులు నిర్వ హించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం వీక్షకులను విశేషంగా అలరించాయి.ఈ కార్య క్రమంలో పాఠశాల ప్రధా నోపాధ్యాయులు వైద్య శ్రీనివాస చారి, ఉపాధ్యా యులు జనగామ ఉమా దేవి, భీం పుత్ర శ్రీనివాస్ జలంపెల్లి, చింతకింది లలిత, గుడివెనుక రవి, మంజుల, అమ్మ ఆదర్శం పాఠశాల చైర్మన్ దూలం అంజలి, బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చారి, విద్యార్థులు, పాల్గొన్నారు.

# వన మహోత్సవ కార్యక్రమంలో అన్ని శాఖలు భాగస్వామ్యం కావాలి

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



నిర్మల్, ఏప్రిల్:22(తెలంగాణ వాణి ప్రతినిధి) వన మహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు గాను ఇప్పటి నుంచే సంబంధిత శాఖల అధికారులందరూ తగు లక్ష్యాలను నిర్దేశించుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో రాబోవు రోజుల్లో వనమహోత్సవం కార్యక్రమం కింద మొక్కలు నాటేందుకు ముందస్తు ప్రణాళికలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా అటవీ, పంచాయతీ, గ్రామీణ అభివృద్ధి, ఎక్సై జ్, మున్సిపల్, తదితర శాఖల ఆధ్వర్యంలో రాబోవు రోజుల్లో నాటే మొక్కలకు సంబంధించి ప్రణాళికలు ఇప్పటినుంచి సిద్ధం చేసుకోవాలన్నారు. గతంలో ఆయా శాఖల ఆధ్వర్యంలో నాటిన మొక్కల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి శాఖ ఆధ్వర్యంలో వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటాలన్నారు. మొక్కల పెంపకానికి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, ఎక్సైజ్ అధికారి ఎం.ఎ. రజాక్, డిఈఓ భోజన్న, జెడ్పి సీఈవో భాగ్యలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రిలో రైళ్లను నిలుపాలని రైల్వే డిఎం కు వినతి



మందమర్రి టౌన్ ఏప్రిల్ 22 (తెలంగాణ వాణి విలేకరి ) మందమర్రి రైల్వే స్టేషన్ లొ సూపర్ పాస్ట్, ఎక్స్ ప్రెస్ రైళ్లను నిలుపాలని కోరు తూ బుధవారం బి జెపి జిల్లా మాజీ ప్రధాన కార్య దర్శి రొడ్డ మోహన్ ఆధ్వ ర్యంలో సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ మేనేజర్ గోపాలకృష్ణ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా రొడ్డ మోహ న్ మాట్లాడుతూ చెన్నూ రు నియోజక వర్గంలో అతి పెద్ద మున్సిపాల్టీ గా కొనసాగు తున్న మంద మర్రి మున్సిపాల్టీ లొ సుమారు అరవై వేలకు పైగా జనాభా ఉన్నారని, నిత్యం వ్యాపార, విద్య రీత్యా అనేక మంది ప్రయాణం చేయడం తో పాటు, బొగ్గు గనుల నుండి వివిధ ప్యాక్టరీలకు ఇక్కడి నుండే రవాణ అవుతుందని అన్నారు. మందమర్రి రైల్వేస్టేషన్ లో కేవలం ఇంటర్ సిటీ, భాగ్యనగర్ ఎక్స్ ప్రెస్ రైళ్ళని నిలుపడం తో వివిధ నగరాలు పట్టణా లకు ప్రయాణం చేసే ప్రయాణికులు ఆర్థిక ఇబ్బందులకు ఎదుర్కొం టు మంచిర్యాల, బెల్లంప ల్లి రామకృష్ణ పూర్ స్టేషన్ లకు వెళ్లే పరిస్థితి ఉందని అన్నారు. దీనిపై అనేక సార్లు అధికారులకు విన్న వించిన పట్టింపు చేయడం లేదని అన్నారు. అదే విధంగా మరమ్మత్తుల దృష్ట్యా నార్లపూర్ రైల్వే గేట్ గత కొన్ని నెలలుగా మూసివేయడంతో నిత్యం గేటు వెంట ప్రాయాణం చేసే రైతులు, గ్రామాల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే గేట్ తెరిపించేలా చర్యలు చేపట్టాలని కోరారు.పట్టణ ముఖద్వారం వైపు రెండో టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు.ఈ సందర్బంగా దీనిపై రైల్వే డి ఎం సానుకూలంగా స్పందించారని వారం రోజుల్లోగా నార్లపూర్ రైల్వే గేట్ తెరిపిస్తామని అలాగే రైళ్ల నిలుపుదల, టికెట్ కౌంటర్ ఏర్పాటు చేస్తామ ని హామీ ఇచ్చినట్లు తెలి పారు. ఈ కార్యక్రమం లొ బి జే పి నాయకులు మాల్యాల రాజమల్లు, సప్పిడి నరేష్,రంగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డిసిఒ



నిర్మల్, ఏప్రిల్:22(తెలంగాణ వాణి ప్రతినిధి) జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ను , నూతన జిల్లా కోపరేటివ్ ఆఫీసర్ గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్రీనివాసరావు, కలెక్టరేట్లోని తన చాంబర్లో బుధవారం సాయంత్రం పూల మొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిసిఓ కు శుభాకాంక్షలు తెలిపారు. క్రమశిక్షణగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ, మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



ఎల్లారెడ్డి (తెలంగాణ వాణి ప్రతినిధి) ఎల్లారెడ్డి మండలం అన్నా సాగర్ అంగన్వాడి కేంద్రం ఒకటిలో బుధవారం చిన్నారులకు పోషణ పక్వాడలో భాగంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు, సీమంతాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్రవంతి, సూపర్వైజర్ ఈశ్వరి భాయ్, జిపియో సావిత్రి, తల్లులు అంగన్వాడి టీచర్ టీవీ దుర్గా తదితరులు పాల్గొనడం జరిగినది

# జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలో చలివేంద్రాల ఏర్పాటు




నర్సంపేట: ఏప్రిల్ 22(తెలంగాణ వాణి ప్రతినిధి) నర్సంపేట నియోజకవర్గం, నర్సంపేటపట్టణం,ఎండాకాలంలో రోజు రోజుకి ఎండల తీవ్రత పెరుగుతున్నా క్రమంలో బాటసారులు మరియు సాధారణ ప్రజలకు త్రాగు నీటికి ఇబ్బంది కలగకుండా అంగడి సెంటర్ లో మరియు వరంగల్ రోడ్ చౌరస్తా దగ్గర జనతా ట్రస్ట్ కుటుంబ సభ్యులు జనతా ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాల ఏర్పాటు చేసి,ప్రారంభించిన జనతా ట్రస్ట్ ఛైర్మన్ డా, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి,ట్రస్ట్ సభ్యులు పుట్టపాక రవి ,దొడ్డ రవీందర్ ,శ్రీరాం కిరణ్ ,గండు నవీన్ ,శీలంసత్యనారాయణ ,గూడూరు సందీప్ ,తనుగుల అంబేద్కర్ ,దుంకదువ్వ రంజిత్ ,కొంకిస విఘ్నేష్ ,శీలం భానుప్రసాద్ ,పెంతల శ్రీకాంత్ రెడ్డి ,అబ్బరబోయిన రాజు ,సూత్రపు సరిత ,గుర్రపు నరేష్ ,ఠాకూర్ విజయ్ సింగ్ ,కాసుల నాగేంద్ర బాబు ,బోయిని సుధాకర్ ,తిమ్మాపురం శివ ,సామల ప్రవీణ్ ,తప్పెట్ల సతీష్ ,గోస్కుల సందీప్, తదితరులు పాల్గొన్నారు..

# జనసంద్రంగా మారిన ఆర్. కొత్తగూడెం వారపు సంత

**- మూడు మండలాల చిరు, సంత వ్యాపారులకు ఆహ్వానం పలికిన ఆత్మ కమిటీ చైర్మన్**



చర్ల (తెలంగాణ వాణి) చర్ల మండలంలోని ఆర్. కొత్తగూడెం గ్రామంలో గత వారం ప్రారంభమైన 'వారపు సంత' రెండో వారానికి చేరుకునేసరికి జనసంద్రంగా మారింది. స్థానిక సర్పంచ్, వార్డు సభ్యుల అకుంఠిత ప్రయత్నాల ఫలితంగా రూపొందిన ఈ సంతకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వెల్లువలా తరలివచ్చారు.బుధవారం ఉదయం నుంచే అసంఖ్యాక జన సమూహం రాకతో ప్రధాన రహదారులు ఇసుక వేస్తే రాలనంతగా కిక్కిరిసిపోయాయి. వాహనాల రాకపోకలకు సైతం వీలులేకుండా రోడ్లు జనంతో నిండిపోవడం ఈ సంత విజయానికి నిదర్శనం. వ్యాపారుల కోలాహలం, కొనుగోలుదారుల సందడితో గ్రామ వీధులు జాతరలా మారాయి. స్థానిక నివాసి ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు మాట్లాడుతూ, సంత అనుకున్న దానికన్నా విజయవంతం అవటంవల్ల చర్ల, పక్క మండలాలైన దుమ్ముగూడెం వెంకటాపురం లలోని చిరు వ్యాపారస్తులకు, సంత వ్యాపారస్తులకు ఎక్కువ మొత్తంలో నాణ్యమైన అన్ని రకాల వస్తువులు సరుకులు కూరగాయలు తేవాలని కోరారు. మాకు కావల్సింది నాణ్యత మాత్రమే అని అందుకే ఎటువంటి ఆశీల్లు వసూలు చేయడం లేదని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పరస్పరం సహకరించుకుందామని తెలిపారు. కేవలం రెండో వారానికే ఇంత భారీ స్పందన లభించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల పట్టుదల గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి పోసిందని, తమ గ్రామం చర్ల మండలంలో ప్రధాన వ్యాపార కేంద్రంగా మారిందని స్థానికులు కొనియాడుతున్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీ ఆర్ఎస్ పార్టీ మద్దతు

**ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ లను వెంటనే పరిష్కరించాలి**



హుస్నాబాద్ (తెలంగాణ వాణి ప్రతినిది) ఆర్టీసీ కార్మికులు గత రాత్రి నుండి న్యాయమైన డిమాండ్లను ను పరిష్కరించాలని కోరుతూ సమ్మెలో దిగిన సందర్భంగా ఆర్టీసీ కార్మిక సంఘాలు గత 40 రోజుల క్రితమే సమ్మె నోటీసును ఆర్టీసీ. యజమాన్యానికి ఇవ్వగ కావాలనే కాలయాన చేశారు ఆర్టీసీ కార్మికులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదు గత డిమాండ్ల నే ఇప్పుడు పరిష్కారం చేయాలని కోరుతున్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా అని చెప్పేసి అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచిన. సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని టి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఆరోపించారు ఆర్టీసీ కార్మికుల సమ్మె లో దిగితే ప్రభుత్వం బెదిరింపుల దిగుతు సమస్యలు పరిష్కరించకుండా మరోపక్క ప్రైవేట్ బస్సులను నడపడానికి ప్రోత్సహిస్తుంది రాష్ట్రంలో దాదాపు 40 వేల మంది ఆర్టీసీ కార్మికులు సమ్మె దిగుతుంటే ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేని పరిపాలన కొనసాగిస్తుంది ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎక్కడ చూసినా సమ్మెనే జరుగుతుంది ఏ ఒక్క సమస్య పరిష్కరించకుండా మాటలతో కాలం గడుపడమే కాకుండ ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే ప్రతిపక్షాలు ప్రోత్సహిస్తున్నాయని ఆరోపణ చేయడం ఎంత వరకు సమంజసం అన్నారు,ప్రభుత్వ చేతగానితనంతో కార్మికులు సమ్మెకు వస్తే ప్రతిపక్షాలపై విరుచుక పడడం ఎందుకని ప్రశ్నించారు కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచన చేసి ఆర్టీసీ జేఏసీ తో వెంటనే చర్చలకు పిలిచి న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు లేకుంటే ఆర్టీసీ కార్మికుల అండగా టిఆర్ఎస్ పార్టీ ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అన్వర్ పాష నియోజకవర్గ అధికార ప్రతినిధి సుద్దాల చంద్రయ్య మల్లిఖార్జున్ రెడ్డి చిత్తరి శ్రీనివాస్. అనుమల్ల ప్రభాకర్ రెడ్డి మేకల వికాస్ యాదవ్ బుర్ర వెంకన్న గౌడ్. గడ్డం సదానందం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# వివాహ విందుకు హాజరైన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి



నాగిరెడ్డిపేట (తెలంగాణ వాణి ప్రతినిధి) నాగిరెడ్డిపేట మండలానికి చెందిన సీనియర్ నాయకులు , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి గాంధారి మండలం కాయతండ గ్రామానికి చెందిన యువ నాయకులు కొల్ల సుభాష్ వివాహ విందుకు హాజరయ్యారు . ఇట్టి కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ నర్సింలు , గోపాల్పేట్ సర్పంచ్ వంశీకృష్ణ గౌడ్ , కార్యకర్తలు పండిత్ మెగావత్ , బిచ్యా , విలాస్ , గణేష్ , తదితరులు పాల్గొన్నారు.

# మోదీపై వ్యాఖ్యలకు నిరసనగా కార్గే దిష్టిబొమ్మ దహనం




కోరుట్ల (ఆర్.సి తెలంగాణ వాణి) బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు కోరుట్ల పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం.రోజున నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు.పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు.బాధ్యత గల నాయకులు తమ మాటల్లో సంయమనం పాటించాలని సూచిస్తూ ఇటువంటి వ్యాఖ్యలు పునరావృతమైతే మరింత తీవ్ర నిరసనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ కౌన్సిలర్లు కాలాల రాధ సాయిచంద్, సోరుపాక రమాదేవి రమేష్, గుగ్లావత్ శ్రీకాంత్, తిరుమాల వాసు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎర్ర రాజేందర్,గిన్నెల శ్రీకాంత్, మాడవేణి నరేష్, పోతుగంటి శ్రీనివాస్, నేమూరి విజయ్, సాడిగే మహేష్, రాదారపు సత్యనారాయణ,మ్యాకల గణేష్, ఇర్నాల స్వామి, మామిడి మలేష్, బాల్క ప్రేమ్ కుమార్, జగిత్యాల జిల్లా ఉపాధ్యక్షులు తుక్కారం గౌడ్, మండల అధ్యక్షులు పంచారి విజయ్, బీజేవైఎం మండల అధ్యక్షులు వెంకట్ రెడ్డి రాజు, ఉంద్ర విజయ్, బోలిశెట్టి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ జర్నలిస్ట్, దళిత రత్న అవార్డు గ్రహీత ఆరె శరత్‌కు ఘన సన్మానం



హుస్నాబాద్ (తెలంగాణ వాణి ప్రతినిధి) హుస్నాబాద్‌కు చెందిన ప్రముఖ పాత్రికేయుడు, ఉత్తమ జర్నలిస్ట్ మరియు దళిత రత్న అవార్డు గ్రహీత ఆరె శరత్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డా బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఉత్తమ జర్నలిస్ట్, దళిత రత్న అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో హుస్నాబాద్ పట్టణంలో ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేస్తూ సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వికాస్ కళాశాల అధినేత మహ్మద్ సాజిద్, అపోలో ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ వేముల గణేష్‌లు ఆరె శరత్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. జర్నలిజం రంగంలో ఆయన చేస్తున్న సేవలు ప్రశంసనీయం అని వారు కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలోని సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత జర్నలిస్టులదని, ఆ బాధ్యతను శరత్ సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యలపై ధైర్యంగా రాసి మంచి గుర్తింపు పొందారని అభినందించారు. ఈ సన్మానం పట్ల ఆరె శరత్ ఆనందం వ్యక్తం చేస్తూ, తనపై చూపుతున్న ప్రేమాభిమానాలకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల సమస్యలపై నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

## అర్హులందరికీ ప్రజా పాలన ద్వారా సంక్షేమ పథకాలు

### వేములవాడ ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కోరుట్ల:ఏప్రిల్22(ఆర్.సి తెలంగాణ వాణి) కోరుట్ల పట్టణంలోని జి.ఎస్ గార్డెన్ లో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్,ఆది శ్రీనివాస్ హాజరై సుమారు 316 మంది లబ్ధిదారులకు గాను రూ.1.05 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ పేద ప్రజల కష్టాలను తీర్చి,వారికి అండగా నిలుస్తుందనిఅని అన్నారు.పేదలకు అండగా నిలవడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు.పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని,మాట ఇస్తే తప్పని ప్రభుత్వం తమదేనని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా ప్రజల సంక్షేమం విషయంలో వెనుకడుగు వేయబోమని,ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేస్తోందని ఇందిరమ్మ ఇల్లు లేని గ్రామం లేదు అని అభివృద్ధి సంక్షేమ పథకాలు గత ప్రభుత్వంలో లేని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంలో కళ్ళ ముందు కనిపిస్తున్నాయనీ అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజా పాలనలో భాగంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమేనాని కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావు,ఏఎంసీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి,కోరుట్ల మెట్పల్లి మున్సిపల్ చైర్పర్సన్లు తిరుమల వసంత,మైలారపు లింబాద్రి,పట్టణ మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్,కొంతం రాజం నాయకులు అన్నం అనిల్,నెమూరి భూమయ్య,పుప్పాల ప్రభాకర్, దాసరి రాజశేఖర్,తోట గంగాధర్, వెంకటేష్ గౌడ్,గుండోజి శ్రీనివాస్, బోద్దూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యం తాగునీరు సరఫరా చేయాలి

### సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల,ఏప్రిల్ 22 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) జిల్లాలోని సిరిసిల్ల,వేములవాడ మున్సిపల్ పరిధిలో, అన్ని గ్రామాల్లో తాగునీరు నిత్యం సరఫరా చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేసవికాలం నేపథ్యంలో జిల్లాలో తాగునీరు సరఫరాపై ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, నీటి పారుదల శాఖ పబ్లిక్ హెల్త్ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ముందుగా మున్సిపాలిటీలు,అన్ని మండలాల వారీగా మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరా లక్ష్యం ఎంత సరఫరా అవుతుంది. స్థానికంగా ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, మిషన్ భగీరథ ఏఈలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.తాగునీరు సరఫరా కోసం ఇంకా ఏమి కావాలో ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రతి మున్సిపాలిటీ, గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.వేసవి నేపథ్యంలో రానున్న 45 రోజులు చాలా కీలకమని స్పష్టం చేశారు.మిషన్ భగీరథ ద్వారా లక్ష్యం మేరకు నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు.మున్సిపాలిటీలోని ప్రతి వార్డు, విలీన ప్రాంతాలు, అన్ని మండలాల్లోని గ్రామాలు, చివరి ప్రాంతాలకు నీటి సరఫరాలో ఎక్కడా ఇబ్బంది కలగకుండా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఆదేశించారు.నీటి టాంక్ లు, పైప్ లైన్ లలో లీకేజీ లేకుండా చూడాలని, ఇన్ టెక్ వెల్, వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్లలో మోటార్లు ఎప్పుడూ నడిచేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్ట్ లో నీటి మట్టాన్ని పరిశీలిస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. నీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు వస్తే స్థానికంగా ఉన్న వనరులను వినియోగించాలని తెలిపారు. నీటిని రోజూ క్లోరినేషన్ చేయించాలని, ప్రతి పది రోజులకు ఒకసారి నీటి టాంక్ లు శుభ్రం చేయించాలని ఆదేశించారు.అమృత్ పథకం కింద జిల్లాలో మొదలు పెట్టిన ఓ హెచ్ ఎస్ ఆర్ ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. గడువులోగా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే జిల్లా అధికార యంత్రం దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ అమరేందర్, మిషన్ భగీరథ ఈఈలు అన్వర్, సుమలత, పబ్లిక్ హెల్త్ ఈఈ సంపత్, డీఆర్డీఓ గీత,సీపీఓ శ్రీనివాసాచారి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిసి కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

### కార్మికుల సమ్మెకు ఏఐఎఫ్ టి యు (న్యూ) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం మద్దతు

నర్సంపేట: ఏప్రిల్ 22(తెలంగాణ వాణి రిపోర్టర్) 41 రోజుల క్రితమే ఆర్ టి సి కార్మికులుసమ్మె నోటీసు ఇచ్చినపుడే ఆఫీసర్స్ కమిటీ వేసి సమస్యలకు పరిస్కారం చూపాల్సింది పోయి ఇప్పుడు కమిటీ వేయడం సమస్యలు పరిస్కారం చేయడానికి అన్నట్టుగా లేదు. కాబట్టీ ఆ నమ్మకాన్ని ప్రభుత్వం కార్మికులకు కల్పించాలి, వారి డిమాండ్స్ లో ఆర్టీసీని ప్రభుత్వ రంగ సంస్థగా ప్రకటించి విలీన ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి. యూనియన్లను పునరుద్ధరించి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల నిర్వహించాలి. వేతన సవరణ పిఆర్సి బకాయిలు రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి. ఎలక్ట్రిక్ బస్సుల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలి. ఇవే కాకుండా కార్మికుల అన్ని డిమాండ్లను మానవతా దృక్పథంతో పరిష్కరించాలీ, వారి సమస్యలతో పాటు ఆర్ టి సి ఆస్తులను కూడా ప్రైవేట్ పరం చేయొద్దు అనేది కూడా ముఖ్యమైనది . ఆర్ టి సి కార్మికుల సమ్మెకు అన్ని కార్మిక సంఘాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వ టి ఎన్ జి ఓ టి జి ఓ సంఘాలు కూడా సంగీబావం, మద్దతు ప్రకటించాలి, రేపు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఇదే పరిస్థితి రాబోతుంది. అప్పుడు వారి సహకారం కూడా ఎంతో అవసరం అనేది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు గమనించాలి, గత టి ఆర్ ఎస్ ప్రభుత్వంలో కార్మికులు సమ్మె చేసి దాదాపు 40 వరకు కార్మికులు చనిపోవడం జరిగింది. అప్పుడు ఆర్ టి సి సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వ టీ ఎన్ జి ఓ, టి జి ఓ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు కనీసం సంఘీబావం, మద్దతు తెలపక పోవడం చారిత్రక తప్పిదం, ఆలాంటి పొరపాటు ఇప్పుడు చేయొద్దు. గత టి ఆర్ ఎస్ ప్రభుత్వంలో ఆర్ టి సి కార్మికులు చనిపోతే ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో రిటైర్డ్ ఉద్యోగులు వారికీ రావలసిన వారి డబ్బు ప్రభుత్వం నుండి రాక దిక్కుతోచని, అగమ్యగొచరమైన పరిస్థితులల్లో వైద్యం చేసుకోవడానికి, పిల్లల పెళ్లిళ్లు చేయడానికి డబ్బులు లేక ఎందరో రిటైర్ అయిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చనిపోవడం జరుగుతుంది. గత ప్రభుత్వంలొ ఆర్ టి సి కార్మికులు చనిపోతే ఈ ప్రభుత్వంలో రిటైర్డ్ ఉద్యోగులు చనిపోతున్నారు. కాబట్టీ గతంలో ప్రత్యేక తెలంగాణ కోసం ఆర్ టి సి కార్మికులు, , టి ఎన్ జి ఎస్, టి జి ఓ ఎస్ కలిసికట్టుగా సమ్మె చేసి రాష్ట్రాన్ని సాధించుకొన్న అనుభవంతో ఇప్పుడు మన రాష్ట్రంలో మనం సాధించుకున్న రాష్ట్రములో సమస్యల పరిష్కరానికి కలసికట్టుగా ఒకరికొకరు,సహకరించుకువాలి. గత ప్రభుత్వం చేసినట్టుగా ఈ ప్రభుత్వం చేయకుండా ఎన్నికలప్పుడు మేనిఫెస్టో లొ పెట్టినట్టుగా ఆర్ టి సి కార్మికుల సమస్యలను, అదేవిదంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి. అదేవిదంగా ఆర్ టి సి సమ్మెను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.అదేవిదంగా ఆర్ టి సి కార్మిసంఘాలు కూడా ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సమస్యల పరిస్కారానికి పెద్ద మనసుతో ముందుకు వచ్చి పాలసీ తో సమస్యలుపరిష్కరించుకోవాలని విజ్ఞప్తి.ప్రజలకు ఇబ్బందులు కలగొద్దు ఆదే సందర్భంలో ఆర్ టి సి కార్మికుల న్యాయమైన సమస్యలు కూడా పరిస్కారం కావాలి.ఏది ఏమైనా కార్మికుల సమస్యల పరిష్కరానికి చివరి అస్త్రం సమ్మె అనేది నిజం. కార్మికుల, ఉద్యోగుల సమస్యలు జటిలమై సమ్మె దాకా రాకముందే ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోని సమస్యలను పరిష్కరించాలి . ఆర్ టి సి కార్మికుల సమ్మె సాధ్యమైనంత త్వరగా పరిస్కారం కావాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే స్పందించి ఆర్టీసీ కార్మికుల డిమాండ్స్ ను పరిష్కరించి ఆర్టీసీ కార్మికుల సమ్మెను విరమింపచేయాలని డిమాండ్ చేస్తున్నాం.

## ఆర్టీసీ సమ్మెపై సీఎం జోక్యం చేసుకోవాలి

### సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ డిమాండ్




సిద్దిపేట:ఏప్రిల్22 (తెలంగాణ వాణి స్టేట్ కోఆర్డినేటర్) ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వాన్ని వీడాలని, ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకుని సమ్మెను విరమింపజేసేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ డిమాండ్ చేశారు. సిద్దిపేట బస్ డిపో ఎదుట జరుగుతున్న కార్మికుల సమ్మెకు ఆయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ?కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో, సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన కోరారు. ముఖ్యంగా నిలిచిపోయిన రెండు వేతన సవరణలను (గా=జ) వెంటనే అమలు చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ట్రేడ్ యూనియన్లపై విధిస్తున్న ఆంక్షలను ఎత్తివేసి, తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని పవన్ పేర్కొన్నారు. సమ్మెను అణచివేసే క్రమంలో ప్రభుత్వం అనుభవం లేని ప్రైవేటు డ్రైవర్లతో బస్సులు నడపడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని కోరారు. కార్మికుల ఐక్య పోరాటంతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని పిలుపునిస్తూ, ఈ సమ్మెకు సీపీఐ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఆర్టీసీ జేఏసీ నాయకులు రాజయ్య, మల్లేశం, రవీందర్ గౌడ్, రాములు, బి.ఎస్. గౌడ్, హేమలత, రవికుమార్ తదితరులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

### - ఏఎంసీ చైర్మన్ రూప్లా



ధర్మారం (తెలంగాణ వాణి) తెలంగాణలో రబీ సీజన్ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతమైంది. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు ధర్మారం మండలంలోని వివిధ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. బుధవారం మండలంలోని చింతలపల్లి గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్యా రూప్లానాయక్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రూప్లా నాయక్ మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ద్వారా ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు. కేంద్రాలకు వచ్చే దాన్యం కొనుగోలుకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, డిసిసి కార్యదర్శి కొత్త నరసింహులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఆవుల శ్రీనివాస్, అలువాల రాజేశం, జనగామ తిరుపతి, కాంపల్లి రాజేశం, సర్పంచ్ లు సుర రజిత వెంకటేశం, ఆవుల మల్లయ్య, వేల్పుల రేవతి నాగరాజు, గొల్ల కృష్ణ, సున్నం రాజయ్య, ఉప సర్పంచ్ లు మోహన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓరెమ్ చిరంజీవి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నార లక్ష్మణ్, తోపాటు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## యాక్సిడెంట్‌లో గాయపడిన వ్యక్తికి సహాయం చేసిన సంకరి అనిల్ యాదవ్



పెద్దపల్లి :ఏప్రిల్,22 (తెలంగాణ వాణి ప్రతినిధి) పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఇందారం దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తన సొంత వాహనంలో వెంటనే గోదావరిఖని గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించి సంకరి అనిల్ యాదవ్ మానవత్వాన్ని చాటుకున్నారు. సాధారణంగా ఇలాంటి ఘటనల సమయంలో చాలామంది ముందుకు రావడానికి వెనుకంజ వేస్తారు. అయితే అనిల్ యాదవ్ సమయస్ఫూర్తితో స్పందించి గాయపడిన వ్యక్తిని తన వాహనంలో ఎక్కించుకొని సమీప ఆసుపత్రికి తరలించడం ద్వారా అతని ప్రాణాలను కాపాడేందుకు కీలక పాత్ర పోషించారు. అనిల్ యాదవ్ చేసిన ఈ సహాయానికి డాక్టర్స్, స్థానిక ప్రజలు అభినందనలు తెలియజేస్తూ, ఆయన సేవను ప్రశంసించారు. ఇలాంటి మానవతా దృక్పథం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.

# భర్దిపూర్ లో బడిబాట



ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 22 (తెలంగాణ వాణి విలేకరి) జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం భర్దిపూర్ గ్రామ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గుగులోత్ పవన్ కళ్యాణ్ అధ్యక్షతన బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇబ్రహీంపట్నం మండల విద్యాధికారి బండారి మధు "మాస్ అడ్మిషన్ క్యాంపెయిన్" ను ఉద్దేశిస్తూ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్న సుశిక్షితులైన,అపార అనుభవం కలిగిన ఉపాధ్యాయుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అంతేకాకుండా ఇప్పటికే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నప్పటికీ.వచ్చే విద్యా సంవత్సరం నుండి బడిలో చదివే పిల్లలందరికీ స్టూడెంట్ కిట్ ఉదయం పూట అల్పాహారం అందించనున్నారని.పాఠశాలలో పిల్లల యొక్క చేరికలు పెరగాలని,గ్రామ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని పలు సలహాలు సూచనలు చేశారు.పాఠశాల ఉపాధ్యాయుడు రాకేష్ ని సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భర్తీపూర్ గ్రామ సర్పంచ్ సంగం అమృత,ఉపసర్పంచ్ బింకర్ అఖిలేష్ ,వార్డు సభ్యులు,మాజీ సర్పంచ్,వీడీసీ పెద్దలు,మహిళా సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు రాకేష్, వేణుగోపాల్, సంపత్,మానస తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జిఎంఆర్ ను పరామర్శించిన ఎంపీ ఈటెల రాజేందర్



పటాన్ చెరు, ఏప్రిల్ 22, (తెలంగాణ వాణి రిపోర్టర్) హైదరాబాద్ లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ని మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ బుధవారం నాడు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసున్నారు. ఆయన మంగళ వారం నాడు హైదరాబాద్ లోని ఆయన ఇంటి బాత్ రూమ్ లో కాలు జారి పడ్డారు. దీంతో వెంటనే ఆయనను కుటుంబ సభ్యులు అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఎం పి ఈటెలు రాజేందర్ ఆసుపత్రి కి వచ్చి ఎం ఎల్ ఏ గూడెం మహిపాల్ రెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుని కృపతో గూడెం మహిపాల్ రెడ్డి త్వరగా కోలుకొని ప్రజా సేవలోకి రావాలని ఈటెల అభిలాషించారు.

## అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ పారదర్శకతతో పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



హన్మకొండ (తెలంగాణ వాణి) హన్మకొండ జిల్లాలో మీడియా అక్రిడిటేయేషన్ కార్డుల జారీ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్‌పర్సన్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ, దరఖాస్తుల సంఖ్య, పరిశీలన విధానం గురించి డీపీఆర్ఓను అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత కలిగిన నిజమైన జర్నలిస్టులకే అక్రిడియేషన్ కార్డులు జారీ చేయాలని సూచించారు. వృత్తి ప్రమాణాలు, అనుభవం, సంస్థ గుర్తింపు వంటి అంశాలను ప్రామాణికంగా పరిగణించాలన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, బాధ్యతాయుతంగా నిజమైన సమాచారాన్ని ప్రజలకు అందించాలన్నారు. అక్రిడియేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, ప్రతి దశలో పారదర్శకత పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీపీఆర్ఓ ఆయూబ్ అలీ, డిపూటి ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ అరుణ, డీఏంఎస్సి సభ్యులు గడ్డం కేశవమూర్తి, బీఆర్ లెనిన్, వల్లాల జగన్, సంతోష్, నయిమ్, బుచ్చిరెడ్డి, మధు, సుధాకర్, గోకారపు శ్యామ్, బొల్లా ఆమర్ పాల్గొన్నారు

## శాంతియుత గ్రామం మన అందరి బాధ్యత

**- వెలుగుపల్లిలో పోలీసుల ప్రజా భరోసా**

**- రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రాణాలను కాపాడుకోవాలని తుంగతుర్తి పోలీసుల పిలుపు**



సూర్యాపేట/తుంగతుర్తి (తెలంగాణ వాణి ప్రతినిధి) ?సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామంలో జిల్లా ఎస్పీ కే. నరసింహ (ఐపీఎస్) ఆదేశాల మేరకు నిర్వహించిన పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమం అత్యంత విజయవంతమైంది. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా సాగిన ఈ సదస్సులో పోలీసులు గ్రామస్థులకు శాంతి భద్రతలు మరియు రోడ్డు నిబంధనలపై స్పష్టమైన అవగాహన కల్పించారు.?ఈ సందర్భంగా తుంగతుర్తి మండల సి.ఐ. ఏ నరసింహారావు మరియు ఎస్.ఐ. రుద్ర క్రాంతి కుమార్ సంయుక్తంగా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించినప్పుడే గ్రామం ప్రశాంతంగా ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా వాహనదారులు ప్రయాణ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ వినియోగించాలని వారు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ఘోర ప్రమాదాల గురించి వివరిస్తూ, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని గట్టిగా హెచ్చరించారు.మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం మరియు ట్రిబుల్ రైడింగ్‌కు పాల్పడటం ప్రమాదకరమని అధికారులు స్పష్టం చేశారు. అలాగే ప్రతి వాహనానికి ఖచ్చితంగా ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని వారు గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వెలుగుపల్లి గ్రామ సర్పంచ్ సోలిపురం అశ్విని కన్నా రెడ్డితో పాటు పోలీసు సిబ్బంది బి. రాజు, ఆర్. సాయి, బి. అవినాష్, కే. మధు, రవి మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ అవగాహన కార్యక్రమం ద్వారా గ్రామంలో భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## అడ్మిషన్లు పెంచేలా కృషి చేయాలి

**- కలెక్టర్ చిత్రా మిశ్రా**

**- రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ ను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి**



కరీంనగర్ (తెలంగాణ వాణి)నగునూరు లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కాలేజ్‌లో ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు మరింత పెంచేందుకు ప్రత్యేకంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. విద్యార్థులకు ఉత్తమ విద్య,సదుపాయాలు అందిస్తూ కాలేజీని అత్యుత్త మ స్థాయికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు.బుధవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో కాలేజీ అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాలేజీలో ఉన్న కోర్సులు,విద్యార్థుల సంఖ్య, వసతుల కల్పన తదితర వివరాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షి యల్ డిగ్రీ కాలేజ్‌లు విద్యార్థు ల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తాయని,విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించి కాలేజీని అత్యుత్తమంగా నిలబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ మాలతి, వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, సూపరింటెంట్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కథనం భావోద్వేగంతో అనుసంధానం కావాలి

### గీతం కార్యశాలలో కార్పొరేట్ శిక్షకురాలు జూజర్ (జె) సూచన



పటాన్ చెరు, ఏప్రిల్ 22, (తెలంగాణ వాణి రిపోర్టర్) ప్రభావవంతమైన కథనం భావోద్వేగపరంగా అనుసంధానం కావాలని, ఉమ్మడి అంశాలతో, సులభంగా అర్థమయ్యేలా ఉండాలని అనుభవజ్ఞురాలైన కార్పొరేట్ శిక్షకురాలు జూజర్ (జె) సూచించారు. అదే సమయంలో వ్యంగ్యం, మితిమీరిన హాస్యం, విమర్శ లేదా సున్నితమైన అంశాల పట్ల జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని విద్యా ఆవిష్కరణ, పురోగతి కేంద్రం (సీఏఐఏ) ఆధ్వర్యంలో అధ్యాపకులలో స్వీయ-అభివృద్ధి, వృత్తిపరమైన భావప్రకటనా నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో బుధవారం 'సంభాషణ, ప్రభావం' అనే అంశంపై ఒకరోజు కార్యశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సారథ్యం వహించిన జూజర్ తన విస్తృత నైపుణ్యం నుంచి, ఆమె సమర్థవంతమైన నాయకత్వం, భావ ప్రకటనలో వాటి పాత్రను నొక్కి చెబుతూ, 'నాలుగు ఎం'లు -- లక్ష్యం, సభ్యులు, మనస్తత్వం, పద్ధతి -- సమర్థవంతమైన నాయకత్వం, సంభాషణలో వీటి పాత్రను వివరించారు. అభ్యాసం యొక్క ప్రాముఖ్యత గురించి చెబుతూ, జూజార్ 'మూడు ఈ'లు -- వ్యక్తిత్వ ప్రభావం, శక్తివంతమైన భంగిమలు, అధికారంతో సంబంధం లేకుండా ప్రభావితం చేయడం, కథన శైలులను విడమరచి చెప్పారు. హార్వర్డ్ ప్రొఫెసర్ అమీ కడ్డీ అంతర్దృష్టులను ప్రస్తావిస్తూ, ఆమె అధిక, అల్ప శక్తి భంగిమల ప్రభావాన్ని ప్రదర్శించారు, తద్వారా 'మనస్సు శరీరాన్ని ప్రభావితం చేస్తుంది, ఆ శరీరం తిరిగి మనస్సును తీర్చిదిద్దుతుంది' అనే భావనను తెలియజేశారు. సంభాషణలోని అంశాల సాపేక్ష ప్రాముఖ్యతను జూజర్ మరింత వివరిస్తూ, సంక్షిప్త వివరణ (10 శాతం), సహానుభూతి మ్యాపింగ్ (20 శాతం), భావవ్యక్తీకరణ (70 శాతం) ఉంటుందన్నారు. ఈ కార్యశాలలో పాల్గొన్నవారు తమను తాము పరిచయం చేసుకునేటప్పుడు, లేదా సంస్థకు ప్రాతినిధ్యం వహించేటప్పుడు విశ్వసనీయత లేదా నైతికత, భావోద్వేగం, తర్కం లేదా హేతువులను సమర్థవంతంగా ఉపయోగించడంపై మార్గదర్శనం చేశారు. కథాకథనాన్ని ఒక శక్తివంతమైన సంభాషణ సాధనంగా పరిగణించడం ఈ కార్యశాల ప్రధాన లక్ష్యం. పాత్ర, సందర్భం,సంఘర్షణ, పరిష్కారం, సందేశం వంటి కీలకమైన కథన నిర్మాణాలను జూజర్ వివరించారు. 'సంఘటన-చర్య-ప్రయోజనం',, 'నిర్మాణం-భాగస్వామ్యం-విశ్లేషణ' వంటి ఆచరణాత్మక విధానాలను కూడా ఆమె ప్రవేశపెట్టారు. రవిశంకర్ అయ్యర్ నటించిన వీడియోల ఆధారంగా, ప్రభావవంతమైన కథాకథనం ఎటువంటి ప్రభావాన్ని సృష్టించగలదో ఆమె వివరించారు.ఈ కార్యశాలలో, విద్యాపరమైన ప్రభావం కోసం కథలు చెప్పడంపై ఒక మాస్టర్ క్లాస్ నిర్వహించి, ఉపన్యాసాలు చెప్పే విధానాన్ని మెరుగుపరచడం, తరగతి గదిలో విద్యార్థులను ఆకట్టుకోవడం, జాతీయ, అంతర్జాతీయ వేదికలలో అధ్యాపకుల ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించారు. విద్యా సంస్థలలో సమర్థవంతంగా సమన్వయం సాధించడానికి, ప్రభావాన్ని చూపడానికి, సహానుభూతిని, వ్యూహాత్మక సాధనాలను ఉపయోగించుకునేలా, కోహెన్-బ్రాడ్ ఫోర్డ్ ప్రభావ నమూనాని కూడా పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో వాస్తవ సంస్థాగత సందర్భాలకు అనుగుణంగా రూపొందించిన ముఖాముఖి చర్చలు, ఆచరణాత్మక దృశ్యాలు, విశ్లేషణాత్మక అభ్యాసాలున్నాయి. ఈ కార్యశాలను సీఏఐఏకు చెందిన మోసెస్ కోటికెలా సమన్వయం చేశారు.

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి

### తెలంగాణ ఉద్యమకారుల ఫోరం



హైదరాబాద్ (తెలంగాణ వాణి) కేకే కమిటీని ప్రభుత్వం వేసిన కమిటీగా భావిస్తలేం, ఒకవేళ అదే కమిటీ అయితే కేకే కమిటీ ఆలోచనలు మార్పు చేయాలి అని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్ సూచన మేరకు తెలంగాణ ఉద్యమకారుల ఎంపిక విధానం లోప భూయిష్టంగా ఉంది అని తెలియజేస్తున్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఎంపిక విధానం ప్రభుత్వం ఏ విధంగా అమరులైన కుటుంబాలు, దివ్యాంగులైన ఉద్యమకారులను, జైలుకు వెళ్లిన ఉద్యమకారులను ఆదుకోవడం తర్వాత విడతలో కేసులు ఉన్నవారిని ఆదుకోవడం అని అనడం సమంజసం కాదు అని అన్నారు. ఉద్యమకారుల ఎంపిక విధానం...

- తెలంగాణ అమరవీరుల కుటుంబాలను, దివ్యాంగులైన ఉద్యమకారులను ఆదుకోవాలి
- జైలుకెళ్ళిన ఉద్యమకారులను, ఎఫ్ఐఆర్ అయ్యుండి సంవత్సరాల తరబడి కోర్ట్ల చుట్టూ తిరిగి ఇబ్బందులను ఎదుర్కొన్న ఉద్యమకారులను ఆదుకోవాలి
- బైండోవర్, పేపర్ కటింగ్స్, వీడియో క్లిప్స్, వివిధ సంఘాలకు నాయకత్వం వహించి ఉద్యమించిన ఉద్యమకారులను ఆదుకోవాలి.

పైన పేర్కొన్న కేటగిరీల ఉద్యమకారులను ఏకకాలంలో గుర్తించాలి, విడతల వారీగా గుర్తించకూడదు. ఈ విధమైన పద్ధతిలో కేకే కమిటీ పాటించకపోతే తెలంగాణ ఉద్యమకారుల నుండి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన కుటుంబాలను ఉద్యమంలో అవయవాలు కోల్పోయిన ఉద్యమకారులను ఒకే కేటగిరీలో ఉంచాలి తెలంగాణ ఉద్యమంలో కేసులపాలై సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా నష్టపోతు ఇబ్బంది పడుతూ సర్వస్వం కోల్పోయిన ఉద్యమకారులను జైలుకు వెళ్లిన ఉద్యమకారుల కేటగిరిలో చేర్చాలి ఒకవేళ ప్రభుత్వం కమిటీని గనక ప్రకటిస్తే ఆ కమిటీకి సంబంధించినటువంటి జీవో కాలపరిమితి విధివిధానాలు బహిర్గతం చేయాలి వివిధ సంఘాలకు నాయకత్వం వహిస్తూ ఉద్యమంలో పాల్గొన్న వారి పత్రిక వార్తల ఆధారంగా వీడియో అలా ఆధారంగా వారిని గుర్తించాలి అంతేగాని అమరుల కుటుంబాలను దివ్యాంగులైనటువంటి ఉద్యమకారులను జైలుకు వెళ్లిన ఉద్యమకారులను మొదటి విడతలో ప్రకటించడం వల్ల మిగతా ఉద్యమకారులు మనోవేదనకు గురయ్యే అవకాశంతో క్షణిక ఆవేశంలో అఘాయిత్యాలకు పాల్పడే అవకాశం ఉంది కాబట్టి ప్రభుత్వం ఉద్యమకారుల యొక్క మనోభావాలను గుర్తించి కమిటీ విధివిధానాలు మార్చకపోతే మీయొక్క ఇళ్లను ముట్టడించడం జరుగుతుందని హెచ్చరిస్తున్నారు.

## ఆర్టీసీ కార్మికులు శాంతియుత వాతావరణంలో సమ్మె నిర్వహించుకోవాలి

**- ప్రజా అశాంతికి గురి చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవు : పోలీస్ కమిషనర్**



కరీంనగర్ (తెలంగాణ వాణి ప్రతినిధి) కరీంనగర్ లో కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మె నేప థ్యంలో చట్టాన్ని కాపాడటం పోలీస్ శాఖకు ప్రధాన ప్రాధా న్యతగా ఉందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం స్పష్టం చేశారు. సమ్మెను ప్రజాస్వామ్య రమైన హక్కుగా గౌరవిస్తు న్నప్పటికీ,అది పూర్తిగా శాంతియుత వాతావరణం లోనే నిర్వహించుకోవాలని ఆయన సూచించారు.

**ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ పేర్కొన్న ముఖ్య అంశాలు**

1) సమ్మె కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు,అత్యవసర సేవలు వినియోగించే ప్రజలు ఇబ్బంది పడకుండా ట్రాఫిక్ మరియు రవాణా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. 2) ప్రైవేట్ డ్రైవర్లు తాత్కాలికంగా విధుల్లోకి వచ్చినా,అలాగే ఆర్టీసీ డ్రైవర్లు తిరిగి డ్యూటీలో చేరినా,వారికి ఎటువంటి బెదిరింపులు లేకుండా పూర్తి స్థాయిలో పోలీస్ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు.

3) బస్సుల రాకపోకలు , డిపో ప్రాంతాలు,ముఖ్య కూడళ్లు,మరియు బస్టాండ్ పరిసరాల్లోఅదనపు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసిన ట్లు తెలిపారు.

4) ఎవరైనా ఉద్దేశపూర్వకం గా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించినా,ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఆస్తులకు నష్టం కలిగించినా,అధికారులపై దాడులకు పాల్పడినా, అలాంటి వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు.

5) సోషల్ మీడియాలో తప్పు డు ప్రచారం,వదంతులు వ్యాప్తి చేసిన వారిపైనా పర్యవేక్షణ కొనసాగుతోందని , అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

6) సమ్మెలో పాల్గొనే కార్మికు లు మరియు ప్రజలు పరస్పర గౌరవం పాటిస్తూ,ఎలాంటి ఉద్రిక్తతలకు తావు లేకుండా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

7) శాంతి భద్రతల విఘాతం కలగకుండా సమ్మె నిర్వహిం చుకోవాలని ఎక్కడనైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేటట్లు చర్యలు చేపడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు మరియు వారి ఉద్యో గం పరంగా శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవ డం జరుగుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారన్నారు .

8) కరీంనగర్ ప్రజల శాంతి భద్రతలను కాపాడటంలో పోలీస్ శాఖకు సహకరించా లని,ఎక్కడైనా అనుమానా స్పద పరిస్థితులు కనిపించి నా,ఆర్టీసీ బస్సులు నడిపే డ్రైవర్లను బెదిరింపులకు గురించేసినా వెంటనే కరీంన గర్ పోలీసు స్పెషల్ బ్రాంచి కంట్రోల్ రూమ్ నంబర్ 8712670713 కు కాల్స్ ద్వారా లేదా వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచు తామని ఆయన స్పష్టం చేశారు.సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

## నేటి నుంచి తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు

- హాజరుకానున్న డిల్లీ రైతు ఉద్యమ నేత ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ దావలే
- రైతు పోరాట యోధుడు ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు క్రిష్ణన్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల పై సెమినార్లు
- రైతు సమస్యలపై విస్తృత చర్చ జరుపుతాం

**తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు : పోతినేని సుదర్శన్**




కొత్తగూడెం (తెలంగాణ వాణి) [illegible] 25 వ తేదీ వరకు జరగనున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మూడవ మహాసభలకు రైతాంగ పోరాటాలకు నాయకత్వం వహించిన అతిరథ మహారథులు హాజరవుతున్నారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ తెలిపారు, బుధవారం నాడు మంచికంటిభవన్ లో జరిగిన పత్రికా విలేఖరుల సమావేశం జరిగింది ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుసంఘం రాష్ట్ర మూడవ మహాసభల్లో డిల్లీ రైతు పోరాటంలో కీలక పాత్ర పోషించిన ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ థావలే, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు క్రిష్ణన్, ఖమ్మం మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని తెలిపారు, తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన భూమి హక్కులు, సాగునీరు, కనీస మద్దతు ధరలు, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు,రుణ మాఫీ, రైతు భరోసా, పెండింగ్ లో ఉన్న అటవీ హక్కులు, త్రీ ఫేస్ విద్యుత్, దళారుల దోపిడీ పై మహాసభల్లో అన్ని జిల్లాల నుంచి హాజరయ్యే ప్రతినిదులు చర్చించి భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు. ఈ సందర్భంగా పంటలు, ప్రణాళికలు అంశంపై జరిగే సెమినార్ లో వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ జానయ్య, రైతాంగ పోరాటాలు - ప్రభుత్వ విధానాలు అనే అంశంపై ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు క్రిష్ణన్ ప్రసంగిస్తారని తెలిపారు, ఆహ్వాన సంఘం అధ్యక్షులు ప్రముఖ న్యాయవాది జలసూత్రం శివరాం ప్రసాద్ మాట్లాడుతూ రైతు మహాసభల జయప్రదం కోసం సహకరించిన కొత్తగూడెం ప్రజలకు, ప్రముఖులకు శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలిపారు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహాసభలకు హాజరయ్యే ప్రతినిదులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్వాగతం- సుస్వాగతం పలుకుతుందన్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, భూమి హక్కుల సాధనకు ఉద్యమాలను రూపొందిస్తామని తెలిపారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కొలగాని బ్రహ్మాచారి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్,డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లిక్కి బాలరాజు, రైతు సంఘం జిల్లా నాయకులు కున్సోత్ ధర్మ, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత మహిళలకు సఖి కేంద్రం రక్షణ కవచంలా నిలవాలి

**ఆపదలో ఉన్నవారికిఅండగా నిలవాలి భరోసా కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**




కరీంనగర్ (తెలంగాణ వాణి ప్రతినిది) బాధిత మహిళలకు సఖి కేంద్రం రక్షణ కవచంలా అపన్న హస్తం అందించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారికి ధైర్యము భరోసా కల్పిస్తూ అండగా నిలవాలని సూచించారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం రాత్రి సఖి కేంద్రం మేనేజ్మెంట్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఇందులో సఖి కేంద్రం ద్వారా బాధిత మహిళలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోనూ సఖి కేంద్రం సేవలపై విస్తృ తంగా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గృహహింసతోపాటు ఏదైనా హింసకు గురైన మహిళలు బాలికలకు సఖి కేంద్రం అండగా నిలవాలని సూచించారు. ఇక్కడి నుంచి అయినా వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి తత్వమే సేవలం దించాలని పేర్కొన్నారు. 181 టోల్ ఫ్రీ నెంబర్ ను ప్రతి గ్రామంలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. బాధిత మహిళలకు కౌన్సిలింగ్, వైద్య సేవలు, తాత్కాలిక వసతి న్యాయ సలహాలు పోలీస్ సహాయం అందించాలని పేర్కొన్నారు. జిల్లాలోని ఎంపీడీవోలు తహసిల్దార్లు ఎంపీవోలు పంచాయతీ కార్యదర్శులు అంగన్వాడి ఆశా కార్యకర్తలు ఇతర సిబ్బందిని ఒక రోజు సఖి కేంద్రానికి పిలిపించి సేవలపై అవగాహన కల్పించాలని సూచించారు. అత్యుత్తమ సేవలకు కేరాఫ్ అడ్రస్ గా సఖి కేంద్రాన్ని తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సఖి కేంద్రానికి సంబంధించి అందించిన సేవలు ఇబ్బంది స్పందించిన తీరు సంక్షేమ అధికారి సరస్వతి వివరించారు. ఈ సమావేశంలో ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ కే. మహేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డిపిఓ జగదీశ్వర్, సోషల్ వెల్ఫేర్ డిడి ఇన్చార్జి తిరుపతిరావు, మెప్మా పీడీ స్వరూప రాణి, బిసిడి ఓ అనిల్ ప్రకాష్, సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటర్ లక్ష్మి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ పుల్లయ్య, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తనుకు మహేష్ పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఓసి అందజేసిన జువ్వాడి కృష్ణారావు



కోరుట్ల:ఏప్రిల్ 22 (తెలంగాణ వాణి)కోరుట్ల నియోజక వర్గ పరిధిలోని మెట్ పల్లి పట్టణా నికి చెందిన కటుకం రాజేష్ కుమార్ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతుండగా ఈ విష యాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.1 లక్ష 75 వేల విలువైన ఎల్ఓసి ని బాధిత కుటుంబ సభ్యుల కు జువ్వాడి కృష్ణారావు ఆ అందించారు. ఈ సందర్భంగా బాధితుడు కటుకం రాజేష్ కుమార్ మాట్లాడుతూ ఎల్ఓసి మంజూరు కు సహకరించిన ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలతతో పరిచయ కార్యక్రమం




కొత్తగూడెం (తెలంగాణ వాణి) కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. ప్రేమలతో బార్ అసోసియేషన్ సభ్యులు పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం లైబ్రరీ హాల్లో బారాసోసియేషన్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షులు కిరణ్ కుమార్ ముధలకర్ అధ్యక్షతన నిర్వహించారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జడ్జి ని పుష్పగుచ్ఛం తో సత్కరించారు. అధ్యక్షులు బెంచ్–బార్ సమన్వయం ప్రాముఖ్యతను వివరించారు. జడ్జి ప్రేమలత ఈ సందర్భంగా మాట్లాడుతూ తన ప్రసంగంలో వృత్తి నైతికత, కోర్టు క్రమశిక్షణపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. బెంచ్, బార్ మధ్య పరస్పర గౌరవం అవసరమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఉపాధ్యక్షుడు, షేక్ సాజహాన్ పర్వీన్ ఉపాధ్యక్షుడు, కాటూరి సంజీవరావుప్రధాన కార్యదర్శి గడిపల్లి మహేష్, జాయింట్ కార్యదర్శి

గడదాసు నాగరాజు క్రీడా కార్యదర్శి బానోత్ దేవదాస్, క్రీడా కార్యదర్శి నకరాకంటి ఉమ,మల్లెల ఉషారాణి ,సీనియర్ న్యాయవాదులు జివికె మనోహర్, గణేష్ బాబు, పలివేల సాంబశివరావు,నాగిరెడ్డి, పోసాని రాధాకృష్ణ,ఉదయ్ భాస్కర్, రమేష్ కుమార్ మక్కడ్, వేల్పుల సుధాకర్, కసాని రమేష్,జూనియర్ , మహిళా న్యాయవాదులు మరియు బార్ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం

**ఒకే రోజు కోటిపైగా సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ.**

**ప్రభుత్వ విప్, వేముల వాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



కోరుట్ల (తెలంగాణ వాణి ప్రతినిది) ప్రజా సంక్షేమ మే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభు త్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,కోరుట్ల నియో జకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. కోరుట్ల పట్టణశీలోని జివిస్ గార్డెన్ లో బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథు లుగా ప్రభుత్వ విప్,వేముల వాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగ రావు,మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ హాజరై సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కోరుట్ల నియోజ కవర్గంలోనే భారీగా ఒక్కరో జులోనే కోటికి పైన ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ చేయడం అభినందనీ యమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల అభివృ ద్ధి,సంక్షేమం కోసం అహర్నిశ లు కృషి చేస్తుందని ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులు అందుకు నిదర్శనం అన్నారు. ఒక్క రోజులోనే రూ.1 కోటి 5 లక్షల 46 వేల విలువైన చెక్కు లు 315మంది లబ్ధిదారులకు అందించామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నిస్స హాయకు లకు సహాయం అందించటం ఆనందమేనన్నారు. భారత దేశానికి స్వాతం త్ర్య వచ్చిన తర్వాత పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసే పార్టీ ఏదైనా ఉందా అంటే అది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమే నని గుర్తు చేశారు. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగున్నప్పటికీ అభివృద్ధి సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ 75 వేల కోట్లు అప్పు చేస్తే పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసిందని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిందని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన నాడు మిగులు బడ్జెట్ గా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత బిఆర్ఎస్ పార్టీ దేనన్నారు. వారు చేసిన అప్పులకు నెలకు 6వేలకోట్ల అప్పు కడుతున్నాశీ అని ఓ పక్క ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్పటికీ,రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలను ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సారధ్యం లో నిరంతరం కొనసాగిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్, పోచంపాడు,ఎల్లంపల్లి వంటి ప్రాజెక్టులను నిర్మిస్తే గడిచిన 10 ఏళ్లుగా టిఆర్ఎస్ పాలన లో కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది అది కూడా నాణ్యత లోపంతో నేడు కుంగిపోయి కూలిపోయే పరిస్థితిలో ఉందన్నారు. బీఆర్ఎస్ నేతలు కేవలం డబ్బులు సంపాదించడం,ఆస్తులు సంపాదించుకోవడం కోసమే పాలన చేశారే తప్ప ప్రజల అభివృద్ధి సంక్షేమం పట్ల ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పై క్లిక్ షిప్ వచ్చిందని బిఆర్ఎస్ నేతలు ప్రచారం చేసుకుంటున్నారని అందులో ఏమాత్రం నిజం లేదన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 5 గ్యారంటీలను అమలు చేశామని మరో గ్యారంటీని కూడా త్వరలోనే అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజక వర్గం ఓ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తుందన్నారు. తెలంగాణ మిగతా రాష్ట్రాలకు రోల్ మోడల్ అన్నారు. ఇచ్చిన మాట తప్పని కాంగ్రెస్ పార్టీ 6గ్యారెం టీ లలో 5 గ్యారంటీ లను ఇప్పటికే అమలు చేసిందని మరొ గ్యారంటీ కూడా త్వరలో అమలు చేస్తామన్నా రు. రూ.200 కోట్ల తో ప్రతి నియోజకవర్గాని ఒక రెసి డెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తామని తెలి పారు. అనంతరం కోరుట్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగ రావు మాట్లాడుతూ ఒకే రోజు రూ.1కోటి 5లక్షల 46వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ చేయడంతో పేద, మధ్యతరగతి వారికి చేదోడు వాదోడుగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందన్నారు. నేటి వరకు కోరుట్ల నియోజక వర్గంలో 1600 మందికి రూ. 6 కోట్ల 50 లక్షలు పైగా సీఎం సహాయ నిధి ద్వారా చెక్కులు అందించి ఆర్థిక ఇబ్బందులతో అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్సకై ఖర్చు అయిన డబ్బులను అందజేయడమే ముఖ్యమంత్రి సహాయనిధి ముఖ్య ఉద్దేశం అన్నారు. గత బిఅర్ఎస్ ప్రభుత్వంలో ఇంత పెద్ద మొత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ఇచ్చిన దాఖలా లు లేవన్నారు. స్వర్గీయ మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు తో కలిసి రాజకీయ అరంగేట్రం చేసిన ప్రతి ఒక్కరూ ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభు త్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందించా మన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రొసిడింగ్ తీసుకున్న ప్రతి ఒక్కరు కూడా ఇంటి నిర్మాణా లు త్వరగా చేపట్టుకోవాలని ఇంటి నిర్మాణం ఏ విధంగా జరిగితే ఆ ఇంటి యజమాని ఖాతాలో డబ్బులు జమవుతా యని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు మం జూరు చేయడమే కాకుండా రేషన్ దుకాణాల ద్వారా దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో రేషన్ దుకాణాల ద్వారా సన్నబియా న్ని పంపిణీ చేయడం ఒక చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. మహిళల కు ఉచిత బస్సు ప్రయాణం 200 వరకు ఉచిత విద్యుత్ రూ.500లకే సిలిండర్ను ప్రభుత్వం అందజే స్తుందని,గత అసెంబ్లీ ఎన్నికల ఇచ్చిన హామీలని ఒక్కొక్కటి గా నెరవేరుస్తూ ప్రజా ప్రభు త్వంముందుకు సాగుతుంద న్నారు. కొండ్రికర్ల బ్రిడ్జి నిర్మాణం కోసం మాజీ ఎమ్మెల్యే కల్వ కుంట్ల విద్యాసాగర్ రావు బాండ్ పేపర్ రాసి ఇచ్చి 10 ఏళ్ల పదవిని అనుభవించారే తప్ప బ్రిడ్జి నిర్మాణం చేయ కుండా కాలయాపన చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విషయాన్ని మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించిన బ్రిడ్జి నిర్మాణం కోసం విధులు మంజూరు చేసి టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణం చేపడతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజల ఎల్లవేళలా అండగా ఉంటూ అభివృద్ధి సంక్షేమ ధ్యేయంగా కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, మెట్పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి,కోరుట్ల మార్కెట్ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ షాహిద్ ఉల్ ఆహద్,మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, వివిధ మండలాల మార్కెట్ కమిటీ చైర్మన్ లు,డైరెక్టర్లు పలువురు కౌన్సిలర్లు,వివిధ గ్రామాల సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి గార్డెనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు యూనిఫామ్స్ పంపిణీ

**ఏఐటీయూసీ కృషి ఫలితంగా యూనిఫార్మ్స్ సాధన**

**సహకరించిన అధికారులు, కాంట్రాక్టర్స్**



కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి) సింగరేణిలో ని కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలో ఇల్లందు బంగ్లోస్, చిల్డ్రన్ పార్కు ఏరియా, హెడ్ ఆఫీస్, మెయిన్ హాస్పిటల్ తదితర పార్కులలో పనిచేస్తున్న గార్డెనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు బుధవారం యూనిఫామ్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కేడబ్ల్యు కృష్ణఫర్ లు మాట్లాడుతూ సింగరేణి పార్కులలో పనిచేస్తున్న గార్డెనింగ్ కాంట్రాక్ట్ కార్మికులు సుమారు పది సంవత్సరాల పైనుండి విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కాగా వీరికి ప్రారంభం నుండి యూనిఫార్మ్స్ ఇతర సౌకర్యాలు లేని నేపధ్యంలో సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేసిన పోరాటాలు, కృషి ఫలితంగా గతంలో సీఎంపిఎఫ్, బ్యాంక్ జీతాలు ఇతర సౌకర్యాలు సాధించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. యూనిఫామ్స్ కూడా సాధించుకున్నామని తెలిపారు. అందుకు సహకరించిన కార్పొరేట్ ఫారెస్ట్ విభాగం అధికారులకు, కాంట్రాక్టర్లకు యూనియన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్స్ ఏ ప్రభాకర్ రెడ్డి, సూపర్వైజర్స్ సందీప్, రాము, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం




కొత్తగూడెం (తెలంగాణ వాణి) ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ఫెలోషిప్( ఎస్ జి ఎఫ్ ),ఉమెన్స్ గిల్డ్ భద్రాద్రి జిల్లా ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ ధరిత్రి దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగూడెం లోని సింగరేణి చిల్డ్రన్స్ పార్క్ లో ధరిత్రి దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి, పర్యావరణాన్ని పరిరక్షించుకుంటేనే మానవాళికి మనుగడ ఉంటుందని ఈ సందర్భంగా పాల్గొన్న వక్తలు పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ ఖాసిం, ఉమెన్స్ గిల్డ్ భద్రాద్రి జిల్లా అధ్యక్షురాలు డాక్టర్.ఎస్.కె నూరి మెహరు న్నీసా, జిల్లా కోఆర్డినేటర్ ఎం. జ్యోతిరాణి, కోశాధికారి సమ్మయ్య, ముఖ్య ప్రతినిధులు జరీనాబీ, షేక్ ఖాదర్ మొయినుద్దీన్, కళ్యాణి, అంజమ్మ, యశోద, కళావతి,తదితరులు పాల్గొన్నారు.

# స్తంభించిన ఆర్టీసీ చక్రం.. డిపోల వద్ద తీవ్ర ఉద్రిక్తత

- డిపో ప్రధాన ద్వారం ముందు బైఠాయించిన కార్మిక సంఘాలు
- బస్సులను అడ్డుకున్న ఆందోళనకారులు.. పోలీసుల మోహరింపు
- వాగ్వివాదం..తోపులాటతో రణరంగమైన డిపో పరిసరాలు
- అక్రమ అరెస్టులతో సమ్మెను అణచివేయాలని చూడటం దుర్మార్గం
- ప్రజాస్వామ్యబద్ధంగా సాగుతున్న నిరసనపై పోలీసుల ప్రతాపం అన్యాయం
- అరెస్టులు చేసినా వెనకడుగు వేయం
- కార్మిక ఐక్యతతోనే ప్రభుత్వ మెడలు వంచి డిమాండ్లు సాధించుకుంటాం
- ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నేత కందుల భాస్కర్




కొత్తగూడెం (తెలంగాణ వాణి) అర్ధరాత్రి నుంచి ఆర్టీసీ చక్రం స్తంభించింది. కార్మికుల న్యాయపోరాటంతో కొత్తగూడెం డిపో వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆర్టీసీ ఉద్యోగ, కార్మిక సంఘాల పిలుపు మేరకు మంగళవారం అర్ధరాత్రి నుంచే సమ్మె ప్రారంభం కాగా బుధవారం తెల్లవారుజామున కొత్తగూడెం డిపోకు చేరుకున్న ఆర్టీసీ ఉద్యోగులు, సంఘాలు, సిపిఐ ప్రజాసంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య భారీ వాగ్వివాదం, తోపులాట జరిగింది. పోలీసులు ఆందోళనకారులను బలవంతంగా అరెస్టు చేసి చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తమ న్యాయమైన హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. ఎన్ని ఆంక్షలు విధించినా, అరెస్టులు చేసినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికుల ఐక్యతతోనే విజయం సాధ్యమని, ప్రతి ఒక్కరూ సమ్మెకు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ మొండి వైఖరి వల్లే ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళన కార్యక్రమంలో సిపిఐ నాయకులు సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, గెడ్డాడు నగేష్, భూక్యా శ్రీనివాస్, కె రత్నకుమారి, లక్ష్మీనారాయణ, షాహీమ్, కైసర్, షమీమ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com